RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక


www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 246 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 సెప్టెంబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

### 25 రాష్ట్రాలకు రెయిన్ అలర్ట్.. 3 నెలల్లో విధ్వంసం

గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా అనేక చోట్ల జోరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ 25 రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ క్రమంలోనే ఢిల్లీలో కూడా భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. దేశ రాజధానిలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున చాలా చోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. మరోవైపు వాయువ్య భారతదేశంలోని జమ్మూ కశ్మీర్, లడఖ్, గిల్గిత్, ముజఫరాబాద్, పశ్చిమ రాజస్థాన్‌లలో శనివారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో 29 వరకు ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఢిల్లీతో పాటు, హర్యానా, చండీగఢ్‌లకు కూడా ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# అస్సలు తగ్గట్లేదబ్బా...!



## జోరందుకున్న ఆపరేషన్ 'మూసీ'

హైదరాబాద్, సెప్టెంబర్ 26: ఆపరేషన్ మూసీ పనులు జోరందుకున్నాయి. మూసీ ప్రక్షాళనపై రాష్ట్ర సర్కార్ స్పీడ్ పెంచింది. మూసీ వద్ద ఉన్న ఆక్రమణలు తొలగించిన వెంటనే సుందరీకరణ పనులపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా మూసీ నిర్వాసితుల గుర్తింపు కోసం సర్వే కొనసాగుతోంది. పునరావాసం కోసం పేదల వివరాల సేకరించే పనిలో పడ్డారు అధికారులు. పునరావాసం తర్వాతే ఇళ్ళు కూల్చివేయాలని సర్కార్ నిర్ణయించింది. అర్హులైన కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్ళు ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. మూసీ నదిని ఆక్రమణ నుంచి విడిపించేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. మూసి రివర్ బెడ్‌లో 2,166 ఇళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే అత్యధికంగా హైదరాబాద్ జిల్లా పరిధిలో ఆక్రమణలను అధికారులు గుర్తించారు.

**అధికారులకు సవాల్..** మరోవైపు మూసీ నివాసితుల ప్రాంతాల్లో ఉదయం నుంచి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మూసీ బాధితుల వివరాలు సేకరించడానికి అధికారులు రంగంలోకి దిగగా.. నివాసులు అడ్డుకుంటున్నారు. గురువారం ఉదయం మూసీ రివర్ బెడ్‌లో 25 ప్రత్యేక సర్వే బృందాలు చేరుకున్నాయి. ఒక్కో టీమ్‌లో తహసీల్దార్‌తో పాటు ఐదుగురు ఆఫీసర్లు ఉన్నారు. రివర్ బెడ్‌లో మొత్తం 2,166 ఇళ్లను అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ నిర్మాణాలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు.. బఫర్ జోన్‌లో నిర్మాణాలకు ఇళ్ళతో పాటు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే పలు ప్రాంతాల్లో సర్వే కోసం వచ్చిన అధికారులను స్థానికులు అడ్డుకుంటున్నారు. దీంతో మూసీ నివాసితుల సర్వే అధికారులకు సవాల్‌గా మారింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఇళ్లను అధికారులు మార్క్ చేస్తున్నారు.

**1,600 నిర్మాణాలు గుర్తింపు..** మూసీ ఆక్రమణలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆక్రమణలను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిషోర్ తెలిపారు. ఇదే విషయమైన బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ సుందరీకరణలో భాగంగా మూసీలో ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన దాదాపు 1,600 నిర్మాణాలను సర్వే ద్వారా గుర్తించినట్లు తెలిపారు. ఈ నిర్మాణాలను తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అయితే, ఇందుకోసం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఒక కార్యాచరణను రూపొందించినట్లు దాన కిషోర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఒక్క నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను మంజూరు చేసి పునరావాసం కల్పిస్తామని ప్రకటించారు. దాదాపు 15 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లను మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్‌లో నివసిస్తున్న కుటుంబాల పునరావాసానికై రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని దాన కిషోర్ తెలిపారు. రివర్ బెడ్లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి పునరావాస కార్యాచరణకై సంబంధిత జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు రూపొందించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించి పునరావసం కల్పించిన తర్వాతనే ఈ నిర్మాణాల తొలగింపు కార్యక్రమం ప్రారంభమవుతోందని దాన కిషోర్ వెల్లడించారు.




## అధికారులకు కేటీఆర్ మాస్ వార్నింగ్

హైదరాబాద్: అధికారులు, పోలీసులు ప్రభుత్వానికి వత్తాసు పలకకూడదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు పేర్కొన్నారు. అలా చేసిన వారికి ప్రస్తుతం ఏపీలో ఏం జరుగుతుందో చూస్తున్నారుగా అని అధికారులను హెచ్చరించారు. సిరిసిల్లలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అధికారులు కాంగ్రెస్ నేతల్లా, కార్యకర్తల్లా అత్యుత్సాహాన్ని ప్రదర్శించకూడదన్నారు. ఏపీలో ఆల్ ఇండియా సర్వీస్ అధికారులను కూడా సస్పెండ్ చేశారని.. ఈ విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. అధికారం శాశ్వతం కాదని, అధికారులు చట్టం ప్రకారం కాకుండా ఇష్టం వచ్చినట్టు చేస్తాం అంటే ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు.

**వారంతా సిద్ధంగా ఉండాలి..** రాష్ట్రంలో ఎక్కడ ఉప ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి అన్న విషయం తెలిసిందే. ఈ కామెంట్స్‌పై కేటీఆర్ స్పందించారు.

పార్టీ మారిన 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగడం ఖాయమని.. కడియంతోపాటు అందరూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో పార్టీ ఫిరాయించిన వారికి పరాభవం తప్పదని కేటీఆర్ విమర్శించారు.

**రోడ్డునపడ్డ నేతన్నల కుటుంబాలు..** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయంగా తన మీద ఉన్న కోపంతో రాజన్న సిరిసిల్ల ప్రజల మీద, నేతన్నల మీద పగ తీర్చుకుంటున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో నేతన్నల ఆత్మహత్యలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ఉన్నప్పుడే బీఆర్ఎస్ తరపున రూ.50 లక్షలు పద్మశాలి ట్రస్ట్‌కు ఇచ్చి సిరిసిల్లను ఆదుకున్నట్లు చెప్పారు. విద్యార్థులకు యూనిఫామ్స్‌తో పాటు రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకకు ఇచ్చే చీరలను సిరిసిల్ల నేతన్నలకు ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ దివాలాకోరు ఆలోచనల వల్ల రాష్ట్రంలోని కోటిమందికి పైగా ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు బంద్ అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన మీద కక్ష ఉంటే తనపైనే తీర్చుకోవాలని.. కానీ నేతన్నలను ఇబ్బంది పెట్టవద్దని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

## డీజేలతో ఇబ్బందులు.. త్వరలోనే ఆంక్షలు....

హైదరాబాద్ : ఏవైనా పండుగలు.. ఉత్సవాలు.. ర్యాలీలు అంటే వెంటనే గుర్తొచ్చేది డీజే.. ప్రస్తుతం డీజే ఓ ట్రెండ్‌గా మారింది. డీజే లేకపోతే ఫుల్ బోర్.. ఓ వైపు డీజే పేరుతో పెద్ద పెద్ద సౌండ్స్ పెట్టి డ్యాన్స్ చేయడం దాదాపు అన్ని ర్యాలీల్లో చూస్తున్నాం. ఈ డీజే సౌండ్స్‌పై పలు ఫిర్యాదులు వస్తున్నాయి. పెద్ద పెద్ద సౌండ్స్‌తో ఇబ్బందులు పడుతున్నట్లు నగర వాసులు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో డీజేల నియంత్రణపై హైదరాబాద్ పోలీసులు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు.

హైదరాబాద్ పోలీస్ కమిష నర్ సీవీ ఆనంద్ అధ్యక్షతన మతపరమైన ర్యాలీల్లో డీజే, టపాసుల వినియోగంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, మత సంఘాల ప్రతినిధులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీస్ అధికారులతో పాటు, జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రాపాలీ, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎంఐఎం ఎమ్మెల్యేలు, మత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**డీజే శబ్దాలపై ఫిర్యాదులు..** డీజే శబ్దాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ సౌండ్స్‌తో నివాసాల్లో వయసు మీరిన వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొందరు గుండె అదురుతుందని ఆందోళన చెందుతున్నారని, డీజే సౌండ్స్ శృతి మించుతున్నాయన్నారు. కేవలం వినాయక చవితి ఉత్సవాల సందర్భంగానే కాకుండా మిలాద్ ఉన్ నబి వేడుకల్లోనూ




డీజే నృత్యాలు విపరీతమయ్యాయని చెప్పారు. పండుగలు, ఉత్సవాలు లేదా ఏదైనా ర్యాలీల్లో డీజేలు ఎక్కువుగా వాడుతున్నారని తెలిపారు.

పబ్‌లో డ్యాన్సులు చేసినట్లే ర్యాలీల్లో చేస్తున్నారని కమిషనర్ పేర్కొన్నారు. డీజే శబ్దాలను కట్టడి చేయాలని వివిధ సంఘాల నుంచి వినతులు వచ్చాయని తెలిపారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ మత సంఘాల ప్రతినిధులను పిలిచి వారి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. అందరి అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామని, ఆ తర్వాత ప్రభుత్వం డీజేలపై ఓ నిర్ణయం తీసుకుంటుందన్నారు. డీజే శబ్దాలపై నియంత్రణ లేకపోతే ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు.

**డీజేలపై ఆంక్షలు పెడతారా..** మితిమీరిన సౌండ్స్‌తో డీజేల వల్ల ఇబ్బందులు పడుతున్నామంటూ ఎక్కువ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీజేలపై పలు ఆంక్షలు పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డీజేలు పెట్టడానికి సమయాలను నిర్దేశించడంతో పాటు, సౌండ్ పర్సంటేజీపై ఆంక్షలు పెట్టడంతో పాటు.. ఏయే సందర్భాల్లో డీజే వినియోగించాలి, ఏ సందర్భాల్లో డీజేలు ఉపయోగించకూడదనే దానిపై మార్గదర్శకాలు రూపొందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అలాగే ఏయే ప్రదేశాల్లో డీజేను అనుమతించాలి. ఏ ప్రదేశాల్లో అనుమతించకూడదనే విషయంలోనూ ప్రభుత్వం కొన్ని గైడ్‌లైన్స్ రూపొందించనుందనే చర్చ జరుగుతోంది. పోలీసు అధికారుల నివేదిక తర్వాత ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది తెలియాల్సి ఉంది.

# దసరాకు 'కేబినెట్' ధమాకా!




## వచ్చే నెల ఐదో తేదీ తర్వాత ఎప్పుడైనా రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ!

### పీసీసీ అధ్యక్ష నియామకం పూర్తయిన నేపథ్యంలో.. కేబినెట్ విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. దసరా పండుగ సమయంలో కొత్త మంత్రులను నియమించేందుకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. టీపీసీసీ అధ్యక్షుడి నియామక ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో.. కేబినెట్ విస్తరణకు అడ్డంకులు తొలగినట్టేనని, ఈసారి మంత్రివర్గ విస్తరణ ఖాయమని గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వచ్చే నెల 5వ తేదీ తర్వాత ఎప్పుడైనా కొత్త మంత్రులు కొలువుదీరనున్నారని నేతలు చెబుతున్నారు. ఎవరెవరికి చాన్స్ ఇవ్వాలన్న దానిపై మరోమారు చర్చలు జరిపి ఖరారు చేయనున్నట్టు వివరిస్తున్నారు.

**బెర్తుల కోసం పోటాపోటీ :** నిబంధనల ప్రకారం.. రాష్ట్రంలో గరిష్టంగా సీఎం సహా 18 మందికి మంత్రివర్గంలో చోటు ఉంటుంది. ప్రస్తుతం సీఎంతోపాటు 11 మంది మంత్రులు ఉన్నారు.

దీనితో మరో ఆరుగురికి మంత్రివర్గంలో చోటు కల్పించే వెసులుబాటు ఉంది. వీటి కోసం తీవ్ర పోటీ నెలకొంది. పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో.. తమకంటే తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారు. ప్రస్తుతం కేబినెట్లో ప్రాతినిధ్యం లేని జిల్లాల నుంచే కాకుండా.. మిగతా జిల్లాల నుంచి కూడా డజను మందికి పైగా ఎమ్మెల్యేలు తమకు కేబినెట్ బెర్త్‌పై ఆశతో ఉన్నారు.

ఇప్పటివరకు ప్రాతినిధ్యం లేని జిల్లాల నుంచి పరిశీలిస్తే.. మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి (రంగారెడ్డి), జి.వివేక్, జి.వినోద్, కె.ప్రేమ్‌సాగర్‌రావు (ఆదిలాబాద్), పి.సుదర్శన్‌రెడ్డి (నిజామాబాద్), దానం నాగేందర్, అమీన్ అలీఖాన్ (హైదరాబాద్) మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలు నాయక్ (నల్లగొండ), వాకిటి శ్రీహరి (మహబూబ్‌నగర్), టి.జీవన్‌రెడ్డి (కరీంనగర్) కూడా కేబినెట్ బెర్త్ కోసం ఒత్తిడి చేస్తున్నారు. వీరికితోడు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే కె.మదన్‌మోహన్‌రావు, ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, వేముల వీరేశం తదితరులు కూడా సామాజిక వర్గాల ప్రాతిపదికన చాన్స్ ఇవ్వాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

**సామాజిక సమీకరణాలే ప్రాతిపదికగా..** కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఎవరెవరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న దానిపై అధిష్టానం ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపింది. పీసీసీ అధ్యక్ష పదవికి, కేబినెట్ విస్తరణకు మధ్య సామాజిక వర్గాల వారీగా లెక్కలు కుదరకపోవడంతో నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా పీసీసీ అధ్యక్షుడిగా బీసీ నేతను నియమించడంతో మిగతా సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించే విషయంలో ఓ నిర్ణయం తీసుకునే వెసులుబాటు కలిగింది. ప్రస్తుతం మంత్రిమండలిలో ఏడుగురు ఓసీ వర్గానికి చెందినవారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎస్సీలు, ఇద్దరు బీసీలు, ఒక ఎస్టీ నేత ఉన్నారు.

కులాల వారీగా చూస్తే నలుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. ప్రస్తుతం రెడ్లకే చెందిన మరో నేతకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వనున్నట్టు అంచనా. మాదిగ, ఎస్టీ (లంబాడా), బీసీ సామాజిక వర్గాలకు కూడా ఒక్కో బెర్త్ కేటాయించాల్సి ఉంటుందని చెబుతున్నారు. మిగతా రెండు పదవులు ఎవరికన్నది పార్టీ వెసులుబాటు ప్రకారం కేటాయించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

**ఇతర పదవుల భర్తీ కూడా..** వివిధ వర్గాలకు మంత్రివర్గంలో స్థానంతోపాటు అసెంబ్లీలో చీఫ్ విప్, విప్ పదవులు కూడా ఇచ్చే చాన్స్ ఉంది. వీటితోపాటు కీలకమైన ఆర్టీసీ, మైనింగ్, ఎంఐడీసీ, మూసీ డెవలప్‌మెంట్ వంటి కీలక కార్పొరేషన్లకు ఎమ్మెల్యేలను చైర్మన్లుగా నియమిస్తారనే చర్చ జరుగుతోంది.

ఈ క్రమంలో ఏ పదవి ఎవరికి ఇవ్వాలన్న దానిపై సామాజిక వర్గాల కోణంలో నిర్ణయం ఉంటుందని అంటున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విదేశీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత.. ఆయనతోపాటు సీఎం రేవంత్, సీనియర్ మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు ఢిల్లీ వెళ్లి.. అధిష్టానంతో చర్చించనున్నట్టు సమాచారం. మొత్తమ్మీద దసరా పండుగకు మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే చర్చ.. రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఆసక్తి రేకెత్తిస్తోంది.

# సంపాదకీయం

## జగన్ కి బ్యాడ్ పీరియడ్ నడుస్తోందా ?

వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ జాతకాలను నమ్ముతారో లేదో తెలియదు కానీ ఆయన వర్తమాన రాజకీయం చూస్తే బ్యాడ్ పీరియడ్ నడుస్తోంది అనే అంటున్నారు. వైసీపీ ని ఆరు నెలల క్రితం వరకూ ఆహో ఓహో అన్న వారు జగన్ ని ఇంద్రుడు చంద్రుడు అన్న వారు కూడా చాలా సైలెంట్ గా హ్యాండ్ ఇచ్చేస్తున్నారు. తన వారు ఎవరో పరవారు ఎవరో కూడా తెలియనంత తేడాలో జగన్ ఉన్నారు. ఆయన పక్కనే ఉంటున్న వారు కూడా వైసీపీకి గుడ్ బై చెబుతున్నారు. ఇలా వెళ్ళిన వారు అంతా జగన్ మీదనే నిందలు వేస్తున్నారు. మరి వీరికి ఇన్నేళ్ళ పాటు నచ్చిన జగన్ ఇపుడు ఒక్కసారిగా ఎందుకు చెడ్డ అయిపోయారో అర్థం కావడం లేదు అని కూడా అంటున్నారు. జగన్ ఎపుడూ ఒకేలా ఉన్నారని ఆయన మారింది లేదని కూడా పక్కన ఉన్న వారూ సన్నిహితంగా ఉన్న వారూ చెబుతున్న మాట. ఆయన ఆదుకున్న వారు ఓడినా పదవులు ఇచ్చిన వారూ ఎక్కడో ఉన్నా కూడా అందలం ఎక్కించి పెద్దల సభకు పంపించి గౌరవించిన వారు ఇపుడు చాలా ఈజీగా వైసీపీ జెండాను పీకేస్తున్నారు దాంతో జగన్ ఎంపికలు తప్పా అన్న చర్చ కూడా వస్తుంది. సోషల్ ఇంజనీరింగ్ పేరుతో ఇచ్చిన పదవులు అందుకున్న వారూ దెబ్బేస్తున్నారు. అలాగే వీర విధేయులు తండ్రి వైఎస్సార్ కాలం నుంచి తన వెంట ఉన్న వారిని ఆదరించినా వారు కూడా వద్దు పార్టీ అని కష్టకాలంలో తప్పుకుంటున్నారు. మరి ఏ విధంగా జగన్ చేసినది తప్పు అన్న చర్చ కూడా వస్తోంది. సాధారణంగా పదవులు తీసుకున్న వారు పార్టీలో ఉంటారు. పోయిన వారే గేటు దాటుతారు. కానీ వైసీపీలో ముగ్గురు రాజ్యసభ సభ్యులు తమ పదవులు వదిలేసుకుని వెళ్ళిపోయారు. ఇక ఎమ్మెల్సీలూ కొందరు అదే రూట్లో ఉన్నారు. వీరి తీరే ఇలా ఉంటే మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేల సంగతి ఊహించగలమా అన్న చర్చ నడుస్తోంది. ఇదంతా జగన్ చేసుకున్నదేనా లేక రాజకీయమే అలా ఉందా అన్నది కూడా లోతైన చర్చ సాగుతోంది. జగన్ అయినా ఎవరు అయినా పదవులు ఇచ్చినంతవరకే. తీసుకున్న వారికే ఆ విధేయత పార్టీ పట్ల నిబద్ధత ఉండాలి అని అంటున్నారు. ఆ విషయంలో టీడీపీ బెటర్ అని అంటున్నారు. అక్కడా పార్టీ అయిదేళ్ల క్రితం ఘోరంగా ఓడింది. కానీ ఎవరూ బయటకు పెద్దగా రాలేదు. దానికి కారణం చంద్రబాబు అనుసరించిన విధానమే అని అంటున్నారు. ఆయన నేతలకు అందుబాటులో ఉంటూ వారిలో కొత్త ఆశలను రేకెత్తిస్తూ ఉందిలే మంచి కాలం అని సర్ది చెబుతూ భరోసా ఇచ్చారు అని అంటున్నారు. వైసీపీలో చూస్తే పోయిన వారు పోనీయ్ అన్న విధానమే ఉంది తప్ప అధినేత పట్టించుకోవడం లేదు అన్న ఫిర్యాదు ఉంది. ఇది ఎంత వరకూ నిజమో తెలియదు కానీ వైసీపీలో ఉన్న వారిలో ఎక్కువ మందికి పార్టీ ఫిలాసఫీ వంటబట్టింది లేదు అని అంటున్నారు. అందుకే వారు ఎమోషనల్ బాండేజ్ ఏదీ లేకపోవడం వల్లనే ఫ్రీగా పార్టీని వీడుతున్నారు అని అంటున్నారు. ఇక మరో విషయం కూడా చర్చకు వస్తోంది. జగన్ మీద నమ్మకం తగ్గింది అని కూడా అంటున్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ మళ్లీ గెలుస్తుందా అన్నది కూడా డౌటు పెట్టుకునే ముందు చూపుతో నేతలు పార్టీని వీడుతున్నారు అని అంటున్నారు. ఏది ఏమైనా కాలం గొప్పది. అదే ఎవరిని అయినా మంచిగా చూపిస్తుంది. అది బాలేనపుడు ఇలాగే జరుగుతాయని అంటున్నారు. ఇపుడు వైసీపీకి జగన్ కి బ్యాడ్ పీరియడ్ నడుస్తోంది అని మంచి రోజులు మళ్లీ వస్తాయని ఆ పార్టీలో ఆశావహులు అంటున్న మాట. సో వెయిటింగ్ ఫార్ బెటర్ టైం అని భావించడమే అంటున్నారు.

# నల్సార్ విశ్వవిద్యాలయానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక

## ఏర్పాట్లను పర్యవేక్షించిన సంబంధిత అధికారులు



శామీర్ పేట, (గరుడ వార్త) : నల్సార్ విశ్వవిద్యాలయంలో నిర్వహిం చబోయే 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేస్తున్నందున ఇంటలిజెన్స్ సెక్యూరిటి వింగ్ ఎస్.పి రామకృష్ణ మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి తో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈనెల 28న మండల కేంద్రం శామీర్ పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం లో జరిగే స్నాతకోత్సవానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఇంటలిజెన్స్ సెక్యూరిటి వింగ్ ఎస్.పి రామకృష్ణ వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులకు అవసరమైన సూచనలు అందించారు. సంబంధిత శాఖల అధికారులు నిర్వహిస్తున్న పనులను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు తెలియజేసారు. రోడ్లు మరమ్మత్తులు, రెడ్ కార్పెట్లు, నిరంతరాయ విద్యుత్తు, పుష్పలంకారణ, వైద్య శిబిరాలు, అంబులెన్సు, సీటింగ్, మోబైల్ టాయిలెట్స్, పాసులు వంటి ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేస్తుకుంటూ సకాలంలో పనులు పూర్తి చేయాలని ఎస్.పి. తెలిపారు.

ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, శామీర్ పేట తహసీల్దారు యాదగిరిరెడ్డి, అర్ అండ్ బి, పోలీసు, వైద్య, విద్యుత్తు, పర్యాటక శాఖ, పౌర సంబంధాలు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



శామీర్ పేట, (గరుడ వార్త) : వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం పూర్వ ఉమ్మడి మండలంలో ఘనంగా నిర్వహించారు.తెలంగాణ ఉద్యమకారిణి, వీరవనిత చాకలి ఐలమ్మ 129 వ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని సింగాయిపల్లి లో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పలువురు నాయకులు, రజక సంఘం సభ్యులు హాజరై ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సంద ర్భంగా పలువురు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, బానిస సంకెళ్లనుంచి విముక్తి కోసం సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన వీరత్వం తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అన్నారు. చాకలి ఐలమ్మ జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ 8 వ వార్డు కౌన్సిలర్ కోమటిపల్లి సురేష్, సింగాయిపల్లి హకీంపేట్ రజక సంఘం అధ్యక్షుడు డి శంకర్, నాయకులు గణపుర్ కృష్ణ, వలందాస్ మురళి గౌడ్, పిన్నింటి ధర్మారెడ్డి, మహమ్మద్ జాఫర్, పారనంది బాల్ రాజు, వజ్జల శేశాంత్, నక్క మల్లేష్ గౌడ్, జూపల్లి రాజు, జె నాగేశ్వర్ రావు, జె సురేష్, కే శ్రీనివాస్,ఎ రాఘవేందర్, బుల్లెట్ సాయి, కే శివన్న, యమ్ శశి తదితరులు పాల్గొన్నారు.

# కలల గృహం.. సమకూరితే సంబురం



తాండూరు: 'అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లనును పూర్తి చేయడానికి రూ.ఎన్నికోట్లయినా సరే వ్యయం చేస్తాం. పూర్తయిన ఇళ్లను అర్హులైన వారికి రెండు నెలల్లో అప్పగిస్తాం. ఈమేరకు పనులు పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాం.' ఈ నెల 5న తాండూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్న మాటలు ఇవి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇళ్లులేని నిరు పేదలు రెండు నెలల్లో పూర్తయ్యే రెండు పడక గదుల ఇళ్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

**మొదటి దశలో 2,181 గ్రామాల్లో నిర్మాణం**

జిల్లా వ్యాప్తంగా 2016లో గత ప్రభుత్వం 4,323 ఇళ్లను మొదటి దశలో 2,181 గ్రామాల్లో నిర్మించాలనుకుంది. అవసరాల మేర ఇళ్లను నిర్మించడానికి ప్రభుత్వ స్థలాలను కూడా గుర్తించింది. ప్రారంభంలో మంజూరు చేసిన ఇళ్లను దశల వారీగా విస్తరించాలనేది ఉద్దేశం. తాండూరు, వికారాబాద్ పట్టణాల్లో 2,142 రెండు పడక గదులను నిర్మించడానికి నిర్ణయం తీసుకుంది. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా నిర్ణీత రెండుపడక గదుల నిర్మాణాలకు కేవలం 1,763 ఇళ్లను ప్రారంభించి రూ.16 కోట్లను వ్యయం చేసింది.

తాండూరు పట్టణం, కుల్కచర్ల మండలం అడవి వెంకటాపూర్‌లో కొన్ని ఇళ్లు పూర్తయ్యాయి. మోమిన్‌పేటలో పునాదులు దాటలేదు. మిగిలిన అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.

**రూ.3లక్షల ఆర్థిక సాయానికి నిర్ణయం**

శాసన సభ ఎన్నికలకు ముందు భారాస ప్రభుత్వం రెండు పడక గదుల నిర్మాణాన్ని పట్టించుకోకుండా సొంత స్థలాలు ఉన్న పేదల ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షల ఆర్థిక సాయం చేయడానికి నిర్ణయించింది. ఆ మేరకు అర్హుల నుంచి గృహలక్ష్మి పథకం పేరిట 2023లో ద%రి%రఖాస్తులను ఆహ్వానిస్తే తాండూరు నుంచి 13,825, వికారాబాద్..15,796, కొడంగల్..14,548, పరిగి నుంచి 13,942 దరఖాస్తులు వచ్చాయి. 2023 నవంబరు 30న జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి డిసెంబరులో అధికారాన్ని చేపట్టింది. ఆ వెంటనే భారాస ప్రభుత్వంలో గృహలక్ష్మి కింద చేసుకున్న దరఖాస్తులను రద్దుచేసి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు ఆహ్వానించింది.

**ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు 2,74,470**

గత 2023 డిసెంబరు 28 నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి నిర్వహించింది. దీన్లో జిల్లా ప్రజలు మొత్తం 2,74,470 దరఖాస్తులను సమర్పించారు. ఇందులో 60 వేలకు పైబడి ఇందిరమ్మ ఇళ్లకోసమే ఉన్నాయని అంచనా. మిగిలినవి ఇతరత్రా అంశాలకు సంబంధించినవి. ప్రజాపాలనకు వచ్చిన దరఖాస్తులను ప్రస్తుతం కంప్యూటరీకరిస్తున్నారు. ఈనెల 17 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించినవి వరుస క్రమంలో చేపడతారని అధికారులు వివరిస్తున్నారు.

# కాడి పట్టేలా.. దృష్టి పెట్టాలె!

కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ ప్రధానమైనది. కానీ, ఇక్కడి యువత ఈ రంగానికి క్రమంగా దూరమవుతోంది. గిట్టుబాటు కాని సాగు కారణంగా చాలామంది కాడి పట్టడం లేదు. ఉపాధి వెతుక్కుంటూ పట్టణాలకు వలస వెళ్తున్నారని తాజా నివేదిక 'స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయ్‌మెంట్–2024' చెబుతోంది. జీవన భృతి కోసం చిరుద్యోగాలు చేస్తున్నారు. నచ్చిన వ్యాపారాల్ని కొనసాగిస్తున్నారు. మరికొందరు ప్రభుత్వ కొలువులే లక్ష్యగా ఏళ్లతరబడి కుస్తీపడుతున్నారు. ఏటా పంట నష్టాల్ని మూటగట్టుకుంటున్న తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదువు, ఇతర రంగాల వైపు ప్రోత్సహిస్తున్నారు. వ్యవసాయం దండుగ కాదు.. పండుగ అనేలా మార్పు తేవడం ప్రభుత్వ పెట్టుబడులు, ప్రోత్సాహంతోనే సాధ్యమని ఈ రంగం నిపుణులు చెబుతున్నారు.

సేద్యం చేసే భూమిని వ్యవసాయ కమతంగా పిలుస్తారు. విస్తీర్ణం పెరిగే కొద్దీ ఉపాంత, చిన్న, చిన్న మధ్య తరహా, మధ్య తరహా, పెద్ద కమతాలుగా విభజించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో అతి తక్కువ భూమి కలిగిన ఉపాంత రైతులే ఎక్కువ మంది ఉన్నారు. ఖమ్మం జిల్లాలో సగటు భూకమతం 0.91 హెక్టార్లు కాగా, భద్రాద్రి జిల్లాలో 1.30 హెక్టార్లుగా ఉంది. ఉపాంత, చిన్న కమతాల కారణంగా వ్యవసాయం లాభసాటి కావడం లేదు. దీంతో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల్ని ఎంచుకుంటున్నారు. లేదా కౌలు రైతులుగా అవతారమెత్తి నష్టాలబారిన పడుతున్నారు. చిన్న కమతాలు పెరగడం, ప్రతికూల వాతావరణం, కుటుంబ పోషణకు ఆదాయం చాలకపోవడం వంటి



కారణాలతో నేటి యువత వ్యవసాయానికి దూరమవుతున్నట్లు ఇటీవలి అధ్యయనంలో తేలింది.

భద్రాద్రి జిల్లాలో వరి, పత్తి, కందితో పాటు వాణిజ్య పంటలైన ఆయిల్ పాం, మిరప, మామిడిలు ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. ఖమ్మం జిల్లా మిరప, మొక్కజొన్న, పత్తి, కూరగాయల సాగుకు రాష్ట్రంలోనే ప్రసిద్ధి. ఆయా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతికి అపార అవకాశాలు ఉన్నట్లు ఇటీవల ప్రభుత్వం గుర్తించింది. ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, విత్తన తయారీ, ఉత్పత్తుల సేకరణ–ఎగుమతితో పంటలకు డిమాండ్ పెరిగితేనే.. యువత వారసత్వంగా వ్యవసాయాన్ని చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్, అనుబంధ రంగాల్లో చిన్నతరహా యూనిట్ల ఏర్పాటుకు విస్తృత రుణ సదుపాయం కల్పించాలి. బ్యాంకులు, నాబార్డుల సాయంతో పాటు ఉపాధి పథకం నిధులను ఇందుకు భారీగా వెచ్చించాలి. వ్యవసాయ శాఖ యాంత్రీకరణ, ఆధునిక సాగు పద్ధతుల్ని చేరువేయాలి. వ్యవసాయ ప్రదర్శనల్ని విరివిగా ప్రోత్సహించాలి. మా కుటుంబం మూడు తరాలుగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తోంది. వచ్చే తరం వారు కాడి పట్టే పరిస్థితి లేదు. సాగులో పెట్టుబడి పెరిగింది. రసాయన మందులతో దిగుబడులు రావట్లేదు. పంటలకు గిట్టుబాటు ధరల్లేవు. వరి, సాగుకు బదులు కూరగాయలు, వాణిజ్య పంటలు సాగుచేసి కనీస ఆదాయం పొదుతున్నాను. వినూత్న పద్ధతుల్లో సాగు, ప్రభుత్వ ప్రోత్సాహంతోనే వ్యవసాయం లాభదాయకంగా ఉంటుంది. రాంబాబు, రైతు నాయకులగూడెం

# సెల్లార్లలో నిబంధనలకు చెల్లు

సత్తుపల్లి : పట్టణాల్లో బహుళ అంతస్తులు, వాణిజ్య సముదాయాల్లో వాహనాల పార్కింగ్‌కు వినియోగించాల్సిన సెల్లార్లను కొందరు యజమానులు అద్దె వనరులుగా మార్చుకుంటున్నారు. నిబంధనలు తోసిరాజంటూ అక్రమార్జనకు తెగబడుతున్నారు. కొందరు సెల్లార్లలో ఇష్టానుసారంగా గదులు నిర్మించి అద్దెలకు ఇస్తున్నారు. అయినా పట్టణ ప్రణాళిక విభాగం చోద్యం చూస్తోంది. అధికారులు నోటీసులు జారీచేసి చేతులు దులిపేసుకుంటున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో పటిష్ఠ చర్యలను అమలు చేస్తున్నా.. ఇతర మున్సిపాలిటీల్లో మాత్రం కంటి తుడుపు చర్యలతో చేతులెత్తేస్తున్నారు.

**అక్రమార్జనే ధ్యేయం**

ప్రధానంగా ఆసుపత్రులు, వ్యాపార వాణిజ్య సముదాయాలు, పలు అపార్టుమెంట్లను పరిశీలిస్తే సెల్లార్‌లలో గదులు ప్రత్యక్షమవుతున్నాయి. ఆసుపత్రుల్లో రోగుల బంధువుల కోసం ప్రత్యేకంగా కుర్చీలు వేస్తూ,



రోగులకు పడక గదులు నిర్మిస్తూ, ల్యాబ్‌లనూ నిర్వహిస్తూ దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో దుకాణాలు, స్టోర్ రూంల కోసం నిర్మాణలు చేపడుతున్నారు. సెల్లార్లను చూపించి అనుమతులు తీసుకోవడం.. ఆ తర్వాత ఉల్లంఘనలకు పాల్పడడం మామూలైంది.

**వాహనాలు రోడ్లపైకి..** సెల్లార్లల్లో స్థలంలేక వాహనదారులు భవనాలకు ఎదురుగా రోడ్లపైనే అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. రోడ్లు ఇరుకై ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలతో మార్జిన్లలో నిలిపిన వాహనాలు ధ్వంసమవుతున్నాయి. **ఉల్లంఘనులకు నోటీసులు..** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో అధికారులు 26 భవనాల్లోని సెల్లార్లలో అక్రమ నిర్మాణాలను గుర్తించారు. వీటిల్లో 20 చోట నిర్మాణాలు కూల్చివేయించారు. మిగతావారికి జరిమానాలు విధించారు. సత్తుపల్లిలో 8 బహుళ అంతస్తుల్లోని సెల్లార్లలో అక్రమ నిర్మాణాలను గుర్తించారు. నోటీసులను జారీ చేశారు. మరో నాలుగైదు భవనాలకు నోటీసులు ఇవ్వనున్నారు. మధిర పురపాలకంలోనూ రెండు బహుళ అంతస్తుల్లో అక్రమ నిర్మాణాలను గుర్తించిన అధికారులు నోటీసులను అందజేశారు.

**గడువులోగా స్పందించకుంటే చర్యలు**

శ్రీనివాసరావు, టీపీఎస్, సత్తుపల్లి

సత్తుపల్లిలో బహుళ అంతస్తుల్లోని సెల్లార్లలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం. ఇటీవల యజమానులకు నోటీసులను అందించాం. మరోమారు అన్ని వార్డుల్లో తనిఖీలు చేస్తాం. గడువులోగా స్పందించకుంటే చర్యలు తీసుకుంటాం.

# హద్దులు చెరిపేస్తే.. ఆపేస్తామా?

హైదరాబాద్ : ప్రధాన నగరంతోపాటు చుట్టూ ఉన్న చెరువుల సంరక్షణపై హైడ్రా పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. కొన్ని తటాకాల విషయంలో అధికారులు హద్దులు మార్చినట్లు, తప్పుడు పత్రాలు సృష్టించినట్లు హైడ్రా విచారణలో తేలింది. వాటిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు కమిషనర్ రంగనాథ్ కేంద్ర ప్రభుత్వ సంస్థ సాయం తీసుకోబోతున్నారు. ఎన్ఆర్ఎస్‌సీ(నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) నుంచి 45 ఏళ్ల నాటి ఉపగ్రహ చిత్రాలను సేకరించేందుకు సిద్ధమయ్యారు. హైడ్రా, ఎన్ఆర్ఎస్‌సీ మధ్య త్వరలో ఒప్పందం జరగనుంది. ఇప్పుడు వెనకడుగు వేస్తే.. నగరంలో మిగిలిన అరకొర చెరువులు కూడా కబ్జా అవుతాయని, యుద్ధప్రాతిపదికన వాటిని రక్షించాల్సిన అవసరం ఉందని హైడ్రా భావిస్తోంది. లక్ష్యం నెరవేరే వరకు వెనకడుగు ఉండదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

**అవసరమేమిటంటే..**

సరైన ఆధారాలతో కూల్చివేతలు చేపట్టినప్పుడే పనులు లక్ష్యం ప్రకారం కొనసాగుతాయని హైడ్రా భావిస్తోంది. అందులో భాగంగా ఇటీవల కమిషనర్ రంగనాథ్ బాలానగర్‌లోని ఎన్ఆర్ఎస్‌సీ కేంద్రాన్ని సందర్శించారు. శాస్త్రవేత్తలతో హైడ్రా కార్యక్రమాలను పంచుకున్నారు. చెరువుల రక్షణకు సాయం కావాలని అడిగారు. అధికారికంగా చెరువుల హద్దులను నిర్ణయించి, స్పష్టమైన పటాలను ఇవ్వాలని కోరారు. “కొందరు అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చినట్లు తెలుస్తోంది. అలాంటి సందర్భాల్లో ఎన్ఆర్ఎస్‌సీ పటాలు ఉపయోగపడతాయి. అధికారికంగా వాటిని కొనుగోలు చేస్తామని, త్వరగా ఏర్పాటు చేయాలని శాస్త్రవేత్తలను కోరాం” అని రంగనాథ్ వివరించారు.

**ఇటీవల 56 చెరువుల పటాలు..**

ఎన్ఆర్ఎస్‌సీ సంస్థ ఇప్పటికే హైడ్రా అభ్యర్థన మేరకు 56 చెరువుల పటాలను అందజేసింది. 1979-2023 ఏళ్ల మధ్య చెరువులు ఏ విధంగా ఆక్రమణకు గురయ్యాయో చిత్రాలతో సహా వివరించింది. అనేక తటాకాలు కొన్ని రోజుల్లో కనుమరుగవుతాయని చెప్పడమే వాటి ఉద్దేశం. ఆయా పటాలను మరింత పక్కాగా రూపొందించి, హద్దులను నిర్ణయించాలని తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్

# రూ.60 కోట్ల.. పార్కును రక్షించిన హైడ్రా

హైదరాబాద్ : చెరువులు, పార్కుల్లో చేపట్టిన అక్రమ కట్టడాల కూల్చివేతలే లక్ష్యంగా హైడ్రా దూసుకెళ్తోంది. తాజాగా హైటెక్‌సిటీ ప్రాంతంలోని కావూరిహిల్స్ కాలనీలోని ఓ పార్కు స్థలంలో నిర్మించిన అక్రమ షెడ్లను నేలమట్టం చేసింది. ఉదయం 8 గంటలకు చేరుకున్న హైడ్రా అధికారులు జేసీబీలతో పార్కు స్థలంలో నిర్మించిన షెడ్లను కూల్చివేయించారు. కాలనీకి చెందిన 2 వేల గజాల పార్కు స్థలంలో వెలసిన ప్రైవేటు స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణాలపై కావూరిహిల్స్ కాలనీ సంఘం ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేసింది. దీనిపై హైడ్రా విచారణ చేపట్టగా పార్కు ఆక్రమణకు గురైనట్లు తేలింది. దీంతో



కూల్చివేత చేపట్టారు. అనంతరం ‘జీహెచ్ఎంసీ పార్కు’ అని పెద్ద బోర్డులను ఏర్పాటు చేశారు. బహిరంగ మార్కెట్లో స్థలం విలువ రూ.60 కోట్లకుపైగా ఉండొచ్చని స్థానికులు తెలిపారు. కాగా అది పార్కు స్థలం కాదని, క్రీడా శిక్షణ కేంద్రం కోసం ఆ స్థలాన్ని 25 ఏళ్లకు లీజు తీసుకున్నట్లు స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు ప్రసాద్ పేర్కొన్నారు. కాలనీ అసోసియేషన్‌కు, బల్దియాకు లీజు రుసుం చెల్లిస్తున్నామన్నారు. కూల్చివేతలపై కోర్టు ఇచ్చిన స్టేఉత్తర్వులను హైడ్రా పట్టించుకోలేదన్నారు.

**8 ఏళ్ల పోరాటం ఫలించింది: కావూరి రవికుమార్**

కావూరిహిల్స్ కాలనీ.. మాదాపూర్‌లో మొట్టమొదటి హుడా లేఅవుట్ కాలనీ. దాదాపు 10 ఎకరాల స్థలాన్ని పార్కుల కోసం వదిలేశారు. కొందరు ఆ పార్కు స్థలాలను కబ్జా చేశారు. టెన్నిస్ కోర్టు పేరిట 2 వేల గజాల పార్కు స్థలాన్ని ఆక్రమించారు. దీనిపై 8 ఏళ్లుగా న్యాయపోరాటం చేస్తున్నాం. కోర్టు మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేయగా వారు స్పందించి ఆక్రమణలను తొలగించడం ఆనందంగా ఉంది.

# మనమే ముందు

హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో మరింతమంది విద్యార్థులు చేరేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించేందుకు విద్యాశాఖ చేపట్టిన ముఖగుర్తింపు హాజరులో హైదరాబాద్ జిల్లా అగ్రస్థానం దక్కించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే హైదరాబాద్‌లో సగటు హాజరుశాతం 90 శాతానికి పెరిగింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ముఖ గుర్తింపు యాప్‌ను వినియోగిస్తున్నారు. ఉపాధ్యాయుల వద్ద యాప్ ఉన్న ఫోన్, ట్యాబ్ ద్వారా విద్యార్థి వద్ద కెమెరా ఉంచగానే.. పేరు, తరగతి, వివరాలు తెరపైకి కనిపిస్తాయి. ఈ విధానాన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేస్తుండడంతో మూడునెలల్లోనే విద్యాశాఖ అనుకున్న ఫలితాలొచ్చాయి. ముఖ గుర్తింపు నమోదు ప్రక్రియ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 1-10 తరగతి వరకు విద్యార్థుల పేర్లు, తరగతి, సెక్షన్ ఇలా అన్ని వివరాలు యాప్‌లో ఉంటాయి. హైదరాబాద్ జిల్లాలో ముఖగుర్తింపు నమోదు ప్రక్రియను ప్రారంభించక ముందు 1.15 లక్షల మంది విద్యార్థులుండగా ప్రక్రియ అమలు తర్వాత వీరి సంఖ్య 92 వేలుగా తేలింది. అంటే 23 వేల మంది విద్యార్థులు ఎక్కువగా నమోదు అవుతున్నట్లు అధికారులు గుర్తించారు.

పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నాం

సర్కారు బడులంటే అసౌకర్యాలు, ఇరుకు గదులన్న అపోహలున్నాయి. వాటిని తొలగించేందుకు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నాం. తాగునీరు, భోజనశాల, శౌచాలయం ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున అన్ని పాఠశాలల్లోనూ ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయనున్నాం. ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రయోగశాలలు అందుబాటులోకి తెస్తున్నాం.

అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ కలెక్టర్

# వ్యాపార కేంద్రానికి ప్రగతి కళ



గోదావరిఖని : గోదావరిఖనిలోని ప్రధాన వ్యాపార కేంద్రాలైన లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, మేదరిబస్తీ, ఉల్లిగడ్డల బజారు తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. భూగర్భ మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్తు దీపాల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంత వ్యాపారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికలకు ముందు మేదరిబస్తీ-కళ్యాణ్‌నగర్ ప్రధాన రహదారిలో దుర్గంధం భరించలేమంటూ సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లతో పాటు వ్యాపారులు రోడ్డుపై ధర్నా చేశారు. ఓ డివిజన్ కార్పొరేటర్ అయితే ఏకంగా నగరపాలక కార్యాలయం ఇంజినీరింగు విభాగంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చొరవతో వ్యాపార కేంద్రంలో సమస్యల పరిష్కారానికి కార్యాచరణ మొదలైంది. మొదటి విడతలో టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు రూ.100 కోట్ల రుణసాయాన్ని ప్రభుత్వం మంజూరు చేయగా అందులో రూ.29.5 కోట్లు వ్యాపార కేంద్రంలోని సమస్యల పరిష్కారానికే కేటాయించారు. టెండరు ప్రక్రియ పూర్తయి పనులు సైతం మొదలుకావడంతో స్థానికులు సంతోషిస్తున్నారు.

**ముందుగా భూగర్భ మురుగు కాలువలు**

ప్రస్తుతం స్థానికులు దుస్తులతో పాటు వివిధ రకాల కొనుగోళ్లకు మంచిర్యాల, కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇక్కడ భారీ వ్యాపార సంస్థలు లేకపోవడమే దీనికి కారణమని భావించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రథమంగా అత్యాధునిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టారు. తద్వారా భారీ వ్యాపార సంస్థలు గోదావరిఖనిలో ఏర్పాటయ్యేలా ప్రోత్సహించడంపై దృష్టి సారించారు. దీనికంటే ముందుగా వ్యాపార కేంద్రంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ఇప్పటికే మేదరిబస్తీ అడ్డరోడ్డు నుంచి కళ్యాన్‌నగర్ కూడలి వరకు భూగర్భ మురుగు కాలువ నిర్మాణం పూర్తికాగా లక్ష్మీనగర్, మేదరిబస్తీ, ఉల్లిగడ్డల బజారులో నిర్మించాల్సి ఉంది. కళ్యాన్‌నగర్ కూడలి నుంచి అడ్డగుంటపల్లి వరకు సైతం అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ముందుగా రోడ్డుకు ఇరువైపులా తాగునీటి పైపులైన్లు వేసేందుకు తవ్వకాలు చేపట్టారు. రోడ్డు నిర్మించాక ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదనే ఆలోచనతో ఇలా చేస్తున్నారు. పైపులైన్ల నిర్మాణం పూర్తికాగానే భూగర్భ మురుగు కాలువలు, అనంతరం రహదారికి ఇరువైపులా విద్యుత్తు దీపాలను, కొన్ని చోట్ల కేంద్రీకృత విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులన్నీ పూర్తయ్యాక రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

నిధుల కేటాయింపు ఇలా... (రూ. కోట్లు)

భూగర్భ మురుగు కాలువలకు 10

సిమెంటు రహదారులకు 12 పాత విద్యుత్తు స్తంభాల తొలగింపు..కొత్త వాటి ఏర్పాటు 4 విద్యుత్తు దీపాలకు 3.5

# అంతులేని జాప్యం



రుద్రంగి : చందుర్తి-మోత్కురావుపేట మధ్య తారు రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతి జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం కొనసాగుతోంది. దీంతో రహదారి పనులు మధ్యలో ఆగిపోయి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల వేములవాడ శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అనుమతులు తొందరగా ఇచ్చేలా చూడాలని అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు లేఖ రాశారు. ఇప్పటికైనా ఆమోదం తెలిపితే రెండు జిల్లాల ప్రజలకు కష్టాలు తీరుతాయి. చందుర్తి మండల కేంద్రం నుంచి జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని మోత్కురావుపేట మధ్య ఆరున్నరేళ్ల క్రితం రూ. 19.75 కోట్లతో రహదారి పనులకు శంకుస్థాపన చేశారు.

అటవీ ప్రాంతం మినహాయించగా మరో 5 కి.మీ.ల మేర తారు రోడ్డు పనులు నాలుగున్నరేళ్ల కిందట పూర్తయ్యాయి.

అటవీ ప్రాంతంలోని ఐదు చిన్న, చిన్న వాగులపై వంతెనలు నిర్మించాల్సి ఉంది.

వర్షాకాలంలో ఈ మార్గం నుంచి కాలినడకన కూడా వెళ్లలేని విధంగా బురద ఏర్పడుతుంది. వర్షాకాలం ప్రారంభంలో అక్కడక్కడ మట్టితో తాత్కాలికంగా దారిని ఏర్పాటు చేశారు. అనంతరం కురిసిన భారీ వర్షాలకు మట్టి దారి భారీగా కోతకు గురైంది.

జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి, భీమారం మండలాల ప్రజలు చందుర్తి, వేములవాడ, సిరిసిల్ల వంటి ప్రాంతాలకు రావాలంటే సుమారు 20 కి.మీ.ల దూరం తిరిగి రావాల్సి ఉంటుంది. హైదరాబాద్ వంటి పట్టణాలకు ఈ మార్గంలో వెళ్తే 30 నుంచి 40 కి.మీ.ల దూరం తగ్గనున్నది.

శివరాత్రికైనా...

చందుర్తి-మోత్కురావుపేట రహదారిని పూర్తి చేయాలని, అటవీశాఖ అనుమతుల్లో జాప్యాన్ని నిరసిస్తూ 2022లో శివరాత్రి రోజున జాగరణ దీక్ష చేపట్టారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలు ప్రతిపక్షంలో ఉన్నపుడు పాదయాత్రలు చేశారు.

భాజపా ఆధ్వర్యంలో కూడా పాదయాత్ర నిర్వహించారు.

పలు గ్రామాలకు చెందిన యువజన సంఘాల నాయకులు రోడ్డు తొందరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. కనీసం వచ్చే ఏడాది శివరాత్రి నాటికైనా పూర్తయితే రాజన్న భక్తులకు దూరాభారం తగ్గుతుంది.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

చందుర్తి- మోత్కురావుపేట రహదారి పనులు పూర్తి చేసేందుకు అటవీశాఖ అనుమతులు వచ్చేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. రానున్న వేసవి నాటికైనా రోడ్డు పూర్తయితే జగిత్యాల జిల్లాకు, సిరిసిల్ల జిల్లాకు మధ్య దూరాభారం తగ్గుతుంది. రాజన్న భక్తులకు కూడా వ్యయప్రయాసలు తొలగిపోతాయి.

మేడిశెట్టి శ్రీహరి, చందుర్తి

అనుమతులు వస్తేనే పనులు

అనుమతులు వస్తేనే అటవీ ప్రాంతం మధ్యలో నిలిచిపోయిన పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. ఇప్పటికైతే అనుమతులు రాలేదు. మా శాఖ పరంగా చేయాల్సిన కృషి చేస్తున్నాం. శాంతయ్య, డీఈ, ఆర్అండ్‌బీ

# గాడితప్పిన నిఘా..



హైదరాబాద్ : దేశవ్యాప్తంగా తిరుగుతూ యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడం.. స్థానికంగా నిధులు సమీకరించి విధ్వంసాలకు కుట్రపన్నిన మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది రిజ్వాన్ 4 నెలలు నగరంలోనే మకాం వేసినా నిఘావర్గాలు గుర్తించలేకపోయాయి. బంగ్లాదేశీయులు రైళ్లలో దర్జాగా నగరానికి చేరి వీధుల్లో వ్యాపారాలు చేస్తున్నా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. బెంగళూరు పేలుళ్ల కుట్రలో కీలక నిందితుడు కుటుంబంతోసహా టోలిచౌకిలో నివాసమున్నాడు. వరుస ఘటనలతో నగరంలో నిఘా వైఫల్యం మరోసారి వెలుగుచూసింది. గాడితప్పిన వ్యవస్థను దారిన పెట్టేందుకు నగర సీపీ సీవీ ఆనంద్ దృష్టిసారించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా అక్కడి పరిస్థితులు, ఏసీపీలు, సీఐల పనితీరును విశ్లేషిస్తున్నట్లు సమాచారం.

**ఎందుకిలా..?** సౌత్, సౌత్‌ఈస్ట్, సౌత్‌వెస్ట్‌జోన్లలో అధికశాతం సున్నితమైన ప్రాంతాలున్నాయి. రౌడీషీటర్లు, అంతరాష్ట్ర దొంగల ముఠాలకు అవే అడ్డాలు. ఆ ప్రాంతాలపై పట్టున్న వారినే అధికారులుగా నియమించటం ఆనవాయితీ. ప్రస్తుతం మూడు జోన్లలో విధులు నిర్వర్తిస్తున్న డీసీపీలు కొత్తవారు కావడంతో కిందిస్థాయి అధికారులపై ఆధారపడాల్సి వస్తోందనే ఆరోపణలున్నాయి. ఇద్దరు అదనపు డీసీలు పెత్తనం చెలాయిస్తున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో వారిని సీపీ మందలించినట్టు సమాచారం.

**పోలీసుల ఆరోగ్యంపై అప్రమత్తం..** పెరుగుతున్న నేరాలు, బందోబస్తు విధులతో పోలీసులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. కాలనీలో గస్తీ, కేసుల విచారణలో న్యాయస్థానాలకు హాజరయ్యేందుకు అధికశాతం పనిదినాలు వెచ్చించాల్సి వస్తోందని ఒక ఇన్‌స్పెక్టర్ ఆవేదన వెలిబుచ్చారు. సున్నితమైన ప్రాంతంలో కీలక ఠాణా పరిధిలో 60 మందికి పైగా రౌడీషీటర్లున్నారు. సిబ్బంది కేవలం 30 మంది మాత్రమే. గతంలో పోలీసుల ఆరోగ్య సంరక్షణకు సీవీ ఆనంద్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. అందరికి వైద్యపరీక్షలు నిర్వహించి నివేదికను దానిలో పొందుపరిచేవారు. అదేమాదిరి మరోసారి వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# జ్వర బాధితులతో ఆసుపత్రుల కిటకిట

మంథని : నియోజకవర్గ పరిధిలో జ్వరాల విజృంభణతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. పల్లెల్లో వైద్య సేవలు అందుబాటులో లేక బాధితులు మంథని పట్టణానికి వస్తున్నారు. జ్వరమొస్తే వారం వరకు వదలడం లేదు. ఒళ్లు నొప్పులు, చేతులకు దద్దుర్లు రోగులను వేధిస్తున్నాయి. ఆసుపత్రులకు వచ్చే రోగుల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా బాధితులు అధికంగా ఉంటున్నారు. జ్వరం బారిన పడి ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే వివిధ పరీక్షలకు, మందులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతున్నాయని బాధితులు వాపోతున్నారు.



**వాతావరణంలో మార్పులతోనే..**

మంథని సామాజిక వైద్యశాలలో సోమవారం ఓపీ 331గా నమోదైంది. 45 మందికి జ్వరం నిర్ధారించారు. 128 మంది ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకున్నారు. 11 మంది ఆసుపత్రిలో చేరి(ఇన్‌పేషెంట్లుగా) చికిత్స తీసుకుంటున్నారు. సెప్టెంబరు 1 నుంచి 20 వరకు మొత్తం 6,483 మంది ఆసుపత్రికి రాగా 4,285 మంది పరీక్షలు చేయించుకున్నారు. 1,252 మందికి జ్వరాలు నిర్ధారించారు. వీరిలో తొమ్మిది మంది టైఫాయిడ్, 34 మంది డయేరియా బాధితులున్నారు. 322 మంది ఆసుపత్రిలో చేరారు. వాతావరణంలో మార్పులతో జ్వరాలు విస్తరిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత లోపించడం, దోమల బెడదతో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇరవై రోజులుగా జ్వర బాధితులు అధికంగా వస్తున్నారని మంథని ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజూ 250కి పైగా ఓపీ నమోదవుతుండగా, అత్యవసరమైన వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకొని చికిత్స అందిస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వారం, పది రోజుల్లో నొప్పులు తగ్గుతాయని ఆయన చెప్పారు.

# పట్టాదారు పాస్ పుస్తకం అందేదెప్పుడో..!

పెద్దపల్లి : ధరణి వెబ్‌సైట్ ద్వారా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ పదుల సంఖ్యలో భూ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాఫీగా సాగుతున్నప్పటకీ ప్రభుత్వం నుంచి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దాదాపు మూడు నెలలుగా ఈ పరిస్థితి నెలకొనడంతో ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు చేసుకున్న మీ సేవ కేంద్రాలకు రోజూ వెళ్తూ రిజిస్ట్రేషన్ జరిగిందా? అసలు పట్టాదారు పాస్ పుస్తకం వస్తుందా? రాదా? అని ఆరా తీస్తున్నారు.

అన్ని పథకాలకు ప్రామాణికం రుణమాఫీ, పంట రుణాలు, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, రైతు బీమా, విత్తనాలు, ఎరువుల రాయితీలు, యంత్ర పరికరాలు, పాడి పశువుల పంపిణీకి పట్టాదారు పాసు పుస్తకమే ప్రామాణికం. ఉద్యాన పంటలకు ఉపయోగించే బిందు, తుంపర, పాలీ హౌస్‌లకు సంబంధించి సామగ్రి రాయితీపై మంజూరు కోసం పాస్ బుక్‌ను ఆధారంగా చూపించాల్సి ఉంటుంది.

ప్రక్రియ ఇలా..రిజిస్ట్రేషన్లకు ముందు క్రయ విక్రయదారులు మీ సేవలో స్లాట్ బుక్ చేయాలి. ఆ సమయానికి తహసీల్దార్ కార్యాలయానికి హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం రుసుములు చెల్లించాలి. ఆ తరవాత నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసి అంతర్జాలంలో సీసీఎల్ఏ(భూ పరిపాలన ముఖ్య కమిషనర్) కార్యాలయానికి దస్తావేజులు పంపిస్తారు. అక్కడికి వెళ్లిన తర్వాత ప్రభుత్వ అనుమతి ఉన్న ప్రింటింగ్ ప్రెస్ ద్వారా పట్టాదారు పాస్ పుస్తకంలో వివరాలన్నీ నమోదైన తర్వాత నేరుగా తపాలా శాఖ ద్వారా కొనుగోలుదారు చిరునామాకు చేరుతుంది.

వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు మొత్తం తహసీల్దార్ కార్యాలయాల్లోనే జరుగుతాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వానికి ఒక్కో ఎకరా మీద రిజిస్ట్రేషన్లు, స్టాంపు డ్యూటీ ఇతరత్రా అన్ని రుసుములు కలిపి గరిష్ఠంగా రూ.20 వేల వరకు రైతులు చెల్లించాల్సి వస్తుంది. గతంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే పాసు పుస్తకం ఉన్నవారికైతే అందులోనే క్రయ, విక్రయాల వివరాలు కొత్తవి నమోదు చేసి ప్రింట్ తీసి అప్పటికప్పుడే అందించేవారు.

ధరణిలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన పక్షం రోజుల్లోపు పట్టాదారు కొత్త పాస్ పుస్తకం రైతులకు చేరేది. ప్రస్తుత ఆలస్యానికి కొత్త పుస్తకాల కొరత కారణమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మూడు నెలలుగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 1.27 లక్షల మందికి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కావాల్సి ఉంది.

ఈ విషయమై పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌ను సంప్రదించగా రాష్ట్రవ్యాప్తంగా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ కావడం లేదన్నారు. త్వరలోనే అందుతాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

రిజిస్ట్రేషన్ అయినా..

మేము చామనపల్లిలో రెండెకరాల వరకు వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాం. జులై 30న తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. ఇప్పటికీ పాస్‌బుక్ రాలేదు. వాస్తవానికి రిజిస్ట్రేషన్ అయిన 15 రోజుల్లో రిజిస్టర్ పోస్టులో రైతు ఇంటికి పాస్‌బుక్ రావాల్సి ఉంటుందని చెబుతారు. భూమి రిజిస్ట్రేషన్ సమయంలోనే పోస్టల్ ఛార్జీలు, పాస్‌బుక్ ఛార్జీలు కలిపి వసూలు చేస్తున్నా జాప్యం తగదు.

మల్కా మారుతి, బొమ్మకల్

ఇంటికే పంపిస్తామన్నారు.. ఇంకా రాలేదు

మూడు నెలల క్రితం సుల్తానాబాద్‌లోనే 20 గుంటల భూమి కొనుగోలు చేశా. కొత్త పట్టా పాస్ పుస్తకం ఇంకా ఇవ్వలేదు. మీ సేవ కేంద్రంలో అడిగితే రిజిస్ట్రేషన్ అయ్యిందని చెబుతున్నారు. అధికారులను అడిగితే పుస్తకం ఇంటికే వస్తుందని చెబుతున్నారు.

ఎర్రయ్య, సుల్తానాబాద్

ఉమ్మడి జిల్లాలో సగటున రోజుకు రిజిస్ట్రేషన్లు : 2 వేల వరకు..

ప్రభుత్వానికి ప్రతి రోజూ వస్తున్న ఆదాయం : రూ.15 కోట్ల వరకు

పాస్ పుస్తకాలకు ఎదురు చూస్తున్నవారు : 1.27 లక్షల మంది

# ఏటా హరిత లక్ష్యం.. సంరక్షణలో నిర్లక్ష్యం

సారంగాపూర్: సారంగాపూర్ మండలంలోని రేచపల్లి హనుమాన్ గండి వద్ద 2019లో కోతుల ఆహార ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.5,52,781 అంచనా తయారు చేసి రూ.2,99,516 వ్యయం చేసి 1258 కూలీలకు పనిదినాలు కల్పించగా, రూ.2,53,265 సామగ్రి కింద వ్యయం చేశారు. అయితే కొన్నేళ్ల పాటు పంచాయతీలు నిర్వహణలో మొక్కలు కనిపించినప్పటికీ తరువాత చేతులెత్తేయడంతో ప్రస్తుతం మొక్కలు కనిపించకుండా పోయి పిచ్చిమొక్కలు, ఏడారిగా మారాయి. కొన్నేళ్లుగా జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా దాదాపు 22,481 ప్రాంతాల్లో దాదాపుగా 2.50 కోట్ల మొక్కలను నాటినట్లు లెక్కలు చూపుతున్నాయి. ఏటా లక్ష్యం నిర్దేశించడంతో స్థలాలు లేకపోవడంతో నాటిన ప్రాంతాల్లోనే మళ్లీ నాటాల్సి వస్తోంది. కొన్ని నర్సరీలలో మొక్కలు అలాగే ఉండిపోవడంతో ఏపుగా పెరిగి వృక్షాలుగా మారుతున్నాయి. ఏటా లక్ష్యాన్ని నిర్దేశించుకుకొని మొక్కలు నాటడంలో చూపుతున్న శ్రద్ధ సంరక్షణలో కనిపించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మళ్లీ ఈ ఏడాది ఇప్పటికే గ్రామాల్లో గుంతలు తవ్వే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. జిల్లాలోని 380 పంచాయతీల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా



1732 ప్రాంతాల్లో 36.30 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందులో 6.05 లక్షల మొక్కలు ఇళ్లలో కాగా మిగతా ప్లాంటేషన్, రహదారుల వెంట, తదితర ప్రాంతాల్లో నాటనున్నారు. ఇప్పటికే వర్షాకాలం ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా 2,03,778 లక్షల గుంతలు తవ్వి మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా..

మొక్కల నాటేందుకు నిబంధనలకు అనుగుణంగా కూలీలు గుంతలు తవ్వినప్పుడే మొక్క ఎదుగుదల ఉంటుంది. అయితే ఉపాధి సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా గుంతలు తవ్వుతున్నారు. కమ్యూనిటీ, ప్లాంటేషన్, హరిత వనాలలో గుంతను 0.45 సెం.మీ. లోతు, వెడల్పు తవ్వాలి. రహదారుల వెంట 2 ఫీట్లు(0.6 సెం.మీ) గుంత తవ్వాలి. ఒక్క గుంత తవ్వినందుకు రూ.23, మొక్క నాటినందుకు రూ.15 కూలీలకు చెల్లిస్తున్నారు. ఇంత మొత్తం వ్యయం చేసినా నిబంధనలకు అనుగుణంగా గుంతలు ఉండడంలేదన్న విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా ఏటా విద్యుత్తు తీగల కింద మొక్కల నాటడంతో ఎదిగిన మొక్కలను తొలగిస్తున్నారు. మళ్లీ అదే ప్రాంతంలో నాటడంతో ప్రజా ధనం వృథా అవుతోంది.

కనిపించని వనాలుగతంలో కోతుల ఆహార ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. పల్లె ప్రకృతి వనాలు, రహదారుల వెంట ఉన్న మొక్కలు కనిపిస్తున్నా.. మిగతా హరిత వనాలు, కోతుల ఆహార ప్రాంగణాలు కనపడకుండా పోతున్నాయి. ఇప్పటికే ఆయా పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకం ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి ఇంటికి అయిదు చొప్పున మొక్కలు లక్ష్యం కోసం అందిస్తున్నారే తప్పా అవసరమైన మొక్కలను అందించకపోవడంతో తీసుకున్న వెంటనే పక్కన పడేస్తున్నారు. కొందరు ఇంటి ఆవరణలో స్థలం లేనప్పటికీ మొక్కలు అందించడంతో వృథా అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

# 630 కి.మీ.. రూ.236 కోట్లు

ఖమ్మం : టేకులపల్లి మండలం తడికలపూడి నుంచి ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడు వరకు ఉన్న రహదారి ఇది. 7 కి.మీ. బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఏడేళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోలేదు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలతో పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతులతో శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ఈ వర్షాకాలంలో ప్రయాణాలు ప్రాణసంకటంగా మారాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ఆదేశాలతో రోడ్ల దుస్థితిపై ఉభయ జిల్లాల అధికారులు నివేదికలు అందజేశారు. వాటి మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడితేనే ఊరట లభిస్తుంది.

ఆర్అండ్‌బీ రహదారుల నిర్వహణపై ఇటీవల రాష్ట్ర ర.భ. శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. దెబ్బతిన్న రహదారులపై జిల్లాల వారీగా నివేదికలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికారులు వివరాలు సేకరించారు. ఉమ్మడి జిల్లాలో కలిపి మొత్తం 630 కిలో మీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్లు నివేదించారు. గుంతల పూడ్చివేత (ప్యాచ్‌వర్క్), ఇతర మరమ్మతులకు మొత్తం రూ.236 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. వర్షాకాలం నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సత్వరం మరమ్మతులు పూర్తిచేయాల్సి ప్రాధాన్యాన్నీ వారు వివరించారు. మధిర-సిరిపురం రోడ్డు ఇది. టోల్ గేట్ నుంచి రామచంద్రాపురం వరకు చాలాచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల వరదతో తారు కొట్టుకుపోయింది. మరమ్మతులకు ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నా పరిస్థితి మళ్లీ మొదటికొస్తోంది.

సత్వర స్పందనే ముఖ్యం

రాష్ట్ర ర.భ. శాఖకు అన్ని జిల్లాల నుంచి రోడ్ల మరమ్మతులపై నివేదికలు అందాయి. ఆయా ప్రతిపాదనలను పరిశీలించి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. అనంతరం నిధులు విడుదల కాగానే జిల్లాస్థాయుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేయాలి. ఆ తర్వాత గుత్తేదారులతో సత్వరం మరమ్మతులు ప్రారంభించేలా చూడాలి. అయితే, ఇప్పటికే వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. అడపాదడపా జోరు వానలు సైతం కురుస్తున్నాయి. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈలోపే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తిచేయాల్సి ఉంది. అప్పుడే ప్రజా రవాణాపరమైన కష్టాలు తీరతాయి.

# స్థలమున్నా.. నిధులే సమస్య!




కోరుట్ల :జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్ కేంద్రాల్లోని ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ఏళ్ల తరబడి అద్దె, శిథిలావస్థ భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కోరుట్ల పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ సొంత భవనాల నిర్మాణాలకు నిధుల కొరత ఉంది. మెట్‌పల్లి పట్టణంలో పాతభవనాల్లోనే డివిజన్ కార్యాలయాలను నెలకొల్పారు. నిత్యం రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

**17 ఏళ్లుగా..**

కోరుట్లకు 2007లో రవాణాశాఖ ఉప కార్యాలయం మంజూరు కాగా ఆదర్శనగర్‌లోని ఓ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. 17 ఏళ్లుగా అద్దె భవనంలోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కోరుట్ల రవాణాశాఖ పరిధిలో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలు, కథలాపూర్, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలు ఉన్నాయి. అద్దె భవనంలో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. నిత్యం డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్, ఇతర పనుల కోసం వందల మంది వస్తుంటారు. వాహనాల సామర్థ్యం, ట్రాక్ సౌకర్యం లేక ఆరుబయట ప్లాట్లలో ఏర్పాటు చేశారు. ఎండకు, వానలకు ఎంవీఐ, సిబ్బంది, ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సొంత భవన నిర్మాణానికి రెండేళ్ల కిందట రామారావుపల్లెరోడ్‌లో 2.20 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఆస్థలం ట్రాక్ నిర్మించేందుకు అనువుగా లేకపోగా, భవన నిర్మాణానికి కావాల్సిన నిధులు కేటాయించకపోవడంతో వదిలేశారు.

**స్థలం కేటాయించినా..**

కోరుట్లకు 2014లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరుకాగా సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయంపైన ఏర్పాటు చేశారు. కోర్టు పరిధిలోకి కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాలు వస్తాయి. కోర్టుకు వచ్చిన కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది ఉండేందుకు కనీస వసతులు లేకపోవడంతో ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏడాదిన్నర కిందట నూతన భవనంలోకి కోర్టును మార్చారు. నెలకు రూ.50వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. కోరుట్ల కోర్టుకు శాశ్వత భవనం, న్యాయమూర్తి నివాస గృహం, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు 2016లో మెట్‌పల్లిరోడ్‌లో 2 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించినా ఇప్పటివరకు ఎలాంటి నిధులు మంజూరుకాలేదు.

రెవెన్యూ భవనంలో సబ్ కలెక్టర్ కార్యాలయం

మెట్‌పల్లి డివిజన్ కేంద్రంగా ఏర్పడిన తర్వాత సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని మండల రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉన్న రెవెన్యూ కార్యాలయాన్ని స్త్రీశక్తి భవనంలోకి మార్చారు. పాత రెవెన్యూ కార్యాలయ భవనం నిర్మించి సుమారు 40 ఏళ్లు గడుస్తోంది. ఈ భవనానికే కొద్దిపాటి మరమ్మతు చేసి సబ్‌కలెక్టర్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. డివిజన్ పాలనకు కేంద్రమైన సబ్‌కలెక్టర్ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణంపై దృష్టిసారించడం లేదు.

**ఈ-సేవ కేంద్రంలో డీఎస్పీ..**

మెట్‌పల్లి మండల పరిషత్ ఆవరణలోని ఈ-సేవ కేంద్ర భవనంలో డీఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఓ గది, ఒక హాలు మాత్రమే ఉండడంతో అధికారులు, సిబ్బంది అందులోనే విధులు నిర్వర్తిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే డివిజన్ పోలీసులు, ప్రజలకు ఇక్కడ సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

మెట్‌పల్లిలో వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం ఏళ్లుగా మెట్‌పల్లి మండల పరిషత్ ఆవరణలో రేకుల షెడ్డులోనే కొనసాగుతోంది. ఏవో, ఏడీఏ కార్యాలయాలు ఒక్కచోట చిన్న చిన్న గదుల్లో నిర్వహిస్తున్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించిన సమయంలో అవస్థలు ఎదురవుతున్నాయి. మెట్‌పల్లి ఐసీడీఎస్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. కోరుట్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు వేములవాడ నియోజకర్గంలోని కథలాపూర్, మేడిపల్లి మండలాల అంగన్‌వాడీ కేంద్రాలు దీని పరిధిలో ఉండగా, కార్యకలాపాలకు, సమావేశాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మెట్‌పల్లి ఆబ్కారీ శాఖ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. డివిజన్ కేంద్రంగా ఏర్పడ్డ తర్వాత కోరుట్ల, మెట్‌పల్లిలో డివిజన్ పంచాయతీ అధికారి కార్యాలయం లేదు. కోరుట్లలో నీటిపారుదలశాఖకు సొంత భవనం లేదు. ఐబీ గెస్ట్‌హౌజ్‌లోనే కార్యాలయం ఏర్పాటు చేసుకొని విధులు నిర్వహిస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణ.. అత్యున్నత శిక్షణ



ములుగు: ఉన్నత విద్యా ప్రమాణాలకు తోడు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో అన్ని స్థాయిల్లో అటవీ శాఖ అధికారులను అందించాలన్న సంకల్పంతో వెలిసింది సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రం. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా అటవీ నిర్వహణను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అటవీ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చింది. 2016లో అటవీ విద్యకు సంబంధించి బీఎస్సీ కోర్సును ప్రారంభించారు. మొదట్లో హైదరాబాద్ కొంపల్లి సమీపంలోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో కళాశాల ఏర్పాటు చేశారు. 2018లో సిద్దిపేట జిల్లా ములుగులో సొంత భవనాలను నిర్మించి నాటి సీఎం చేతుల మీదుగా కళాశాలను ప్రారంభించారు. ప్రస్తుతం కళాశాలలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో వసతిగృహాలు

అటవీ కళాశాల పరిశోధన కేంద్రానికి సంబంధించిన భవనాలను రూ.72 కోట్లతో నిర్మించారు. అధునాతన సౌకర్యాలతో కూడిన తరగతి గదులు, పరిశోధనా కేంద్రాలు, విద్యార్థులకు వేర్వేరుగా వసతిగృహాలను ఏర్పాటు చేశారు. అధ్యాపకులు, సిబ్బందికి ప్రత్యేకంగా వసతిగృహాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కళాశాల పరిశోధనా కేంద్రానికి 52 హెక్టార్ల అటవీ భూములను కేటాయించారు. ఆట మైదానం అందుబాటులో ఉంది. మొక్కలు పెంచి పరిశోధన చేసే అవకాశం కల్పించారు.

వివిధ అంశాలపై తర్ఫీదు

అటవీ కళాశాల విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా తేనెటీగల పెంపకం, సేంద్రియ ఎరువుల తయారీ, నర్సరీల ఏర్పాటు, వుడ్ వర్క్‌షాప్‌పై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. బోధనలో భాగంగా విద్యార్థులను దేశంలోని పలు ప్రాంతాలకు క్షేత్ర స్థాయి పర్యటనలకు తీసుకెళ్తున్నారు. కేంద్రంలోని నర్సరీలో మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు ఆటల్లోనూ రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. వ్యాయామం, యోగా వంటివి నిత్యం తప్పనిసరి. పోటీ పరీక్షలు రాసేందుకు ప్రత్యేకంగా కోచింగ్ సెంటరునూ ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో చదువుతో పాటు వివిధ విభాగాల్లో రాణించిన పలువురు విద్యార్థులు గవర్నర్ రాధాకృష్ణన్ నుంచి బంగారు పతకాలు అందుకున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దేశంలో ఎక్కడా లేని విధంగా అధునాతన సౌకర్యాలతో కూడిన కళాశాల పరిశోధనా కేంద్రాన్ని ప్రభుత్వం ములుగులో ఏర్పాటు చేసింది. ఇక్కడ చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిత ఖాయం. ఇక్కడి అవకాశాలను ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలి.

ఆశ, కళాశాల పరిశోధన కేంద్రం డీన్

కోర్సుల వివరాలు..

బీఎస్సీలో ఏటా 65 మందికి ప్రవేశం కల్పిస్తున్నారు. ఎమ్మెస్సీలో 20 మంది చేరేందుకు అవకాశం ఉంది. పీహెచ్‌డీలో అయిదు నుంచి పది మందికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఇప్పటివరకు కళాశాల నుంచి అటవీ శాస్త్రంలో బీఎస్సీ పూర్తి చేసిన 250 మంది విద్యార్థులు బయటకు వెళ్లారు. వీరిలో కొందరు ఉద్యోగాలు సాధించగా, మరికొందరు ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. ఎమ్మెస్సీ పూర్తి చేసిన 40 మంది ఇక్కడి నుంచి బయటకు వెళ్లారు. పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనలు కొనసాగుతున్నాయి.

దరఖాస్తు ఇలా..ప్రస్తుతం కళాశాల పరిశోధన కేంద్రంలో బీఎస్సీ అటవీ శాస్త్రానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ర్యాంకుల ఆధారంగా 50 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. పేమెంట్ ఆధారంగా 10 మంది, ఈడబ్ల్యూఎస్ ద్వారా మరో ఐదుగురికి ప్రవేశం కల్పిస్తారు. ఈ నెల 27 వరకు దరఖాస్తు చేయడానికి గడువుంది.

# కంటోన్మెంట్ విలీనంపై ముందడుగు

హైదరాబాద్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని సివిలియన్ ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే విషయమై కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. విలీన అంశానికి సంబంధించిన విధివిధానాలపై కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ ఈనెల 25న తెలంగాణ చీఫ్ కార్యదర్శి శాంతికుమారితో వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారు. బ్రిటిష్ పాలన నుంచి నేటివరకు దేశంలో కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నందున, విలీన ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విలీనానికి సిద్ధంగా ఉన్నట్లు సమ్మతిని తెలిపిందని, విలీన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు పట్టుదలతో ఉందని శాంతికుమారి పేర్కొన్నట్లు సచివాలయ అధికారులు జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించలేదని, ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి పనిచేస్తుందని శాంతికుమారి వెల్లడించినట్లు అధికారులు వివరించారు.

# మురుగు శుద్ధి కేంద్రంపై పట్టిపం?

కరీంనగర్ : స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో మార్కులు సాధించడం.. సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్‌లో నగదు పురస్కారం దక్కించుకున్నా.. మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన దీనిని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉండగా ఎవరికి వారు దాటేసే ధోరణి ప్రదర్శిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిగా కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రం (యూజీడీ)ని రూ.76.50 కోట్లతో నిర్మించారు. ఏళ్ల తరబడి పనులు కొనసాగినా.. చివరికి పదేళ్ల కిందట వినియోగంలోకి తీసుకొచ్చారు. నగర వీధుల గుండా పైపులైన్లు ఉండగా సమీప ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చారు. వీటి గుండా వచ్చే మురుగునీరంతా శుద్ధి చేసేందుకు శివారులోని గోపాల్ చెరువులో 38 ఎంఎల్‌డీల సీవరేజ్ ట్రీట్‌మెంట్



ప్లాంటు నిర్మించారు. సుమారు 2-3 ఎంఎల్‌డీల నీటిని ప్రతిరోజు శుద్ధి చేస్తున్నారు.

ర్యాంకుల కోసం ముస్తాబు

మురుగునీటి శుద్ధి కేంద్రం ఉండగా దానిని నగర వీధుల గుండా వచ్చే మురుగునీటిని శుద్ధి చేయాలనే ఆలోచన వదిలేసి కేవలం ర్యాంకుల కోసం మాత్రమే ముస్తాబు చేస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్, వాటర్‌ం, ఇతర పోటీల సమయంలో అధికారులు, ఉద్యోగులు వచ్చి హడావుడి చేస్తున్నారు. గతేడాది వాటర్‌ం సర్వే సమయంలో లోపాలు కొట్టొచ్చినట్లుగా కనిపించగా అప్పటికప్పుడే కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేశారు. ఆ సర్వే పూర్తి కాగానే ఆ వైపు చూడటం లేదు.

సామర్థ్యం ఉన్నా..

ఇంటి నుంచే మురుగునీటిని పైపులైను గుండా యూజీడీ ప్లాంట్‌కు తరలించి శుద్ధి చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. ఎస్టీపీలో మరో 36 ఎంఎల్‌డీల సామర్థ్యం ఉండగా 40 వేల ఇళ్లకు కనెక్షన్ ఇచ్చుకునే వీలుంది. ప్రస్తుతం మారుతీనగర్, హుస్సేనీపురలోని సుమారు 5 వేల ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వడంతో ఆ నీరే ప్లాంట్‌కు చేరుతోంది. ఈ నీరు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వరదకాలువలోని నీటిని తీసుకొని శుద్ధి చేస్తున్నారు. ఇంటింటా కనెక్షన్ ఇవ్వాలంటే పలు చోట్ల పైపులైన్ల అనుసంధాన పనులు చేయాల్సి ఉంది. ఈ పనులతో పాటు కొత్త కనెక్షన్ల ఊసే లేకుండా పోతుంది.

కొత్త రోడ్లపై కనిపించని భూగర్భ డ్రైనేజీ

స్మార్ట్‌సిటీలో భాగంగా నగరవ్యాప్తంగా కొత్తగా రోడ్లు వేశారు. ఆ సమయంలో భూగర్భ డ్రైనేజీ లైన్ల పైపులైన్లు వేయడంతో పాటు ఇంటర్ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. పైగా ఛాంబర్ నుంచి ఛాంబర్ వరకు తనిఖీ చేయాలి. అదేదీ లేకుండా ఇష్టానుసారంగా పనులు చేసి చేతులు దులుపుకొన్నారు. పైగా గతంలో వేసిన పైపులైన్లు పలుచోట్ల ధ్వంసం చేశారు. ఒక్కోచోట ఒక్కోరకంగా ఉండటంతో అందులోంచి మురుగునీరు ప్రవహించే పరిస్థితి లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొరవడిన చిత్తశుద్ధి

యూజీడీ ప్లాంటులో మొత్తం అయిదు మోటార్లు ఉన్నాయి. ఇందులో 150 హెచ్‌పీ మోటార్లు మూడు ఉండగా ఒకే ఒక మోటారు నడుస్తోంది. 75 హెచ్‌పీ రెండు మోటార్లు ఉండగా అవి పని చేయడం లేదు. నాలుగేళ్లుగా తాత్కాలిక మరమ్మతులతో నెట్టుకురాగా.. ప్రస్తుతం అవి ఏమాత్రం పని చేయడం లేదు. ఏకైక మోటారుతో రోజుకు రెండు, మూడు ఎంఎల్‌డీల నీటిని మాత్రమే శుద్ధి చేసి సమీపంలోని చెరువులకు వదిలి పెడుతున్నారు. దీంతో పాటు ప్యానల్ బోర్డులు, ఇతర సమస్యలుండగా మరమ్మతులు చేయడం లేదు. ఆరోగ్య సమస్యలు రాకుండా పని చేసే కార్మికులకు కావాల్సిన కిట్లు కూడా సరఫరా చేయడం లేదు.

నిర్వహణకు ప్రతిపాదనలు పిలిచాం

ఓంప్రకాశ్, డీఈఈ, కరీంనగర్ నగరపాలిక

గతంలో పని చేసిన ఏజెన్సీ నుంచే మరమ్మతులు, నిర్వహణ పనులు చేసేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలని కోరాం. లైన్లు వేయడంతో పాటు మోటార్లు బాగు చేయడం కూడా అందులోనే ఉంటుంది. ఒకట్రెండు రోజుల్లో ఎస్టిమేట్స్ తీసుకొని ప్రక్రియ ప్రారంభిస్తాం.

# కార్డుల్లేక.. పదేళ్లుగా వ'రేషన్'

ఖమ్మం : జననాల సంఖ్య పెరుగుతున్నా, కుటుంబాల విభజన జరుగుతున్నా.. జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. పుట్టినవారి పేర్లు రేషన్ కార్డుల్లో నమోదు చేయకపోగా.. మరణించిన వారి పేర్లు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. కొత్తకార్డుల కోసం పేద కుటుంబాలు కళ్లల్లో వత్తులేసుకుని ఎదురు చూస్తున్నాయి. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నుంచి కొత్తగా తెల్లరేషన్ కార్డులు ఇవ్వలేదు. అంతకు ముందు జారీ చేసిన కార్డుల ఆధారంగానే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. డిజిటల్ విధానంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఎవరికైనా కార్డు వివరాలు కావాలంటే వారికి కేటాయించిన సంఖ్య ఆధారంగా మీ సేవ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందే. 2021లో జిల్లాలో 12,216 మందికి కొత్తగా తెల్ల రేషన్ కార్డులను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ తర్వాత మళ్లీఊసేలేదు. చనిపోతే వెంటనే వివరాల తొలగింపు.. రేషన్ కార్డుల వివరాలన్నీ ఆధార్‌తో అనుసంధానం చేశారు. దీంతో ఎవరైనా చనిపోతే పౌరసరఫరాలశాఖ ఉపయోగిస్తున్న '360 డిగ్రీస్ సాఫ్ట్‌వేర్'తో వారి వివరాలు వెంటనే తొలగిస్తున్నారు. కానీ కొత్తగా పుట్టిన పిల్లల పేర్లు మాత్రం నమోదు చేయడం లేదు. ఇక కుటుంబాలు విభజన అవుతున్నాయి. విభాజిత కుటుంబాల వారు కార్డులు జారీచేయాలని పదేళ్లుగా కోరుతున్నారు. తాము పథకాలకు నోచుకోవడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపైనే వీరంతా ఆశలు పెట్టుకున్నారు. 'ప్రజాపాలన' గ్రామసభల్లో అత్యధికంగా కార్డుల కోసమే దరఖాస్తులిచ్చారు. ఆ వివరాలు ఇంకా పౌరసరఫరాల శాఖకు చేరలేదు. రేషన్ కార్డు దరఖాస్తులకు గతంలో ఉపయోగించిన వెబ్‌సైట్ కూడా ఇప్పుడు పనిచేయడం లేదు.

కొత్త కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. కార్డులు కావాలని దరఖాస్తు చేసుకున్నవారు, పిల్లల పేర్లు నమోదు చేయాలని కోరుతున్న వారి వివరాలు మా వద్ద లేవు.

చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి




## రైతులకు శుభవార్త.. 18వ విడత పీఎం కిసాన్ నిధుల విడుదలకు ముహూర్తం ఖరారు

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త తెలిపింది. పీఎం కిసాన్ 18వ విడత నిధులను అక్టోబర్ 5న విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ పథకం ద్వారా కేంద్రం ఏటా ఒక్కో రైతుకు రూ. 6 వేల చొప్పున సాయమందిస్తోంది. 2018 డిసెంబర్‌లో ఈ పథకాన్ని ప్రారంభించింది. డీబీటీ ద్వారా డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. ప్రతి నాలుగు నెలలకొకసారి రూ. 2 వేలచొప్పున మూడు వాయిదాలలో డబ్బు ఇస్తున్నారు. పీఎం కిసాన్ యోజన 16వ విడతలో 93 మిలియన్ల మంది రైతులు ఒక్కొక్కరు రూ. 2 వేల వరకు లబ్ధిపొందారు. పీఎం కిసాన్‌కు అర్హత పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అంటున్నారు అధికారులు. ఇందుకోసం... ఫార్మర్ కార్నర్.. విభాగంలోని ఈకేవైసీ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. 12 అంకెల ఆధార్ నంబర్‌ను టైప్ చేయాలి. 'సెర్చ్' బటన్‌పై క్లిక్ చేయాలి. ఆధార్ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేయాలి. ప్రక్రియను పూర్తి చేయడానికి సబ్‌మిట్ నొక్కాలి. తద్వారా ఈకేవైసీ పూర్తవుతుంది.

**రైతులు చేయాల్సిన ముఖ్యమైన పనులివే..** 1. eKYC పూర్తి చేయాలి. . బ్యాంక్ ఖాతాను ఆధార్‌తో లింక్ చేయాలి. 3. భూమి రికార్డులను ధృవీకరించాలి.

**ఆధార్ లింక్ తప్పనిసరి..** పీఎం కిసాన్ నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) వ్యవస్థ ద్వారా బదిలీ అవుతాయి. ఇందుకోసం బ్యాంక్ ఖాతాను మీ ఆధార్ నంబర్‌తో లింక్ చేయాలి. పీఎం కిసాన్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే.. ఆధార్, బ్యాంక్ అకౌంట్, భూ రికార్డులను ధృవీకరించాల్సి ఉంటుంది.




## ఏపీలో మందుబాబులకు సరికొత్త కష్టం!

ఏపీలో వచ్చే నెల నుంచి నూతన మద్యం పాలసీ రానున్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ఊరూ, పేరు లేని బ్రాండ్లు తెచ్చి పెట్టారని మందుబాబులు గగ్గోలు పెట్టిన వేళ, కూటమి ప్రభుత్వం పూర్తిగా పాత తరహా మద్యం విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఇదే సమయంలో బాగా పేరున్న బ్రాండ్లను, పాత బ్రాండ్లను అందుబాటులోకి తేనుందని అంటున్నారు. ఇప్పటికే పలు టాప్ బ్రాండ్ లకు సంబంధించిన మద్యం ఏపీకి చేరిందని కథనాలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇంకా టెండర్ల ప్రక్రియ కొనసాగాల్సి ఉంది! అన్నీ సక్రమంగా జరిగి కొత్త ప్రైవేటు మద్యం దుకాణాల్లో కొత్త మద్యం, చంద్రబాబు చెప్పినట్లు నాణ్యమైన మద్యం అందుబాటులోకి రావాలంటే అక్టోబరు 4వ తేదీ వరకూ సమయం పట్టొచ్చని అంటున్నారు. దీంతో... అక్టోబరు 4 ఎప్పుడు వస్తుందా అని మద్యపాన ప్రియులు ఎదురుచూస్తున్నారని అంటున్నారు. ఈ సమయంలో ప్రస్తుతానికి ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల వల్ల మందుబాబులకు కొత్త కష్టం వచ్చిందని అంటున్నారు. ఇందులో భాగంగా... చాలా మద్యం దుకాణాల్లో "స్టాకు లేదు" అనే బోర్డులు దర్శనమిస్తున్నాయంట. అవును... రాష్ట్రంలో అక్టోబర్ నెల నుంచి కొత్త మద్యం పాలసీలో భాగంగా తక్కువ ధరకే లిక్కర్ అందుబాటులోకి రానున్న వేళ మందుబాబులకు కొత్త చిక్కొచ్చి పడింది. ఇందులో భాగంగా చాలా మద్యం షాపుల ముందు నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయట. ఇప్పటికే డిపోల నుంచి సరుకు సరఫరా నిలిచిపోయిందని.. ఉన్న నిల్వలన్నీ అమ్మాలనే ఆదేశాలు ఉండటంతో అంతా క్లియర్ చేశామని చెబుతున్నారంట. దీంతో... రూ.130, రూ.150 ధరలకు దొరికే బ్రాండ్లు దాదాపు చాలా మద్యం షాపుల్లో అమ్ముడైపోయాయని.. ప్రస్తుతానికి బీరు ప్రస్తావన లేదని.. రూ.220 ఆపైన ధరలున్న మద్యం మాత్రమే అందుబాటులో ఉందని.. అది కూడా క్వార్టర్ బాటిల్స్ కాకుండా హాఫ్ బాటిల్స్, ఫుల్ బాటిల్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారని అంటున్నారు.




## ముంబయి నటి కేసు.. తప్పు చేసిన ఎవర్నీ వదిలే ప్రసక్తి లేదు: హోంమంత్రి అనిత

అమరావతి: ముంబయి నటి కాదంబరీ జెత్వానీ కేసులో ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేసినట్లు హోంమంత్రి అనిత తెలిపారు. తప్పు చేసిన ఎవర్నీ వదిలే ప్రసక్తే లేదన్నారు. కేసులో కొంత మంది పోలీసులను విచారిస్తున్నామని తెలిపారు. విచారణలో బాధ్యులని తేలితే చర్యలుంటాయని చెప్పారు. కేసును సీఎం చంద్రబాబు చాలా సీరియస్‌గా తీసుకున్నారని అనిత పేర్కొన్నారు.



## గో బ్యాక్ క్రిస్టియన్ జగన్ అంటూ స్వాముల నిరసన..

తిరుపతి, సెప్టెంబర్ 26: తిరుమల లడ్డూ వివాదంలో ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 28న తిరుపతికి వెళ్లనున్నట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో తిరుమలలో పలువురు స్వాములు నిరసనకు దిగారు. గో బ్యాక్ జగన్ అంటూ గురువారం అలిపిరి వద్ద శ్రీనివాస ఆనంద స్వామీజీతో పాటు పలువురు స్వాములు ఆందోళనకు చేపట్టారు. గో బ్యాక్ క్రిస్టియన్ జగన్ అంటూ ప్లే కార్డ్స్‌తో నినాదాలు చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్న ఐదు సంవత్సరాలు భార్యతో వచ్చి పట్టువస్త్రాలు సమర్పించని జగన్ ఇప్పుడు ఎందుకు తిరుమలకు వస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నో ఆలయాలపై దాడి జరిగినప్పుడు నోరు మెదపని జగన్ ఇప్పుడు ప్రెస్‌మీట్ ఎందుకు పెట్టారని నిలదీశారు. ఏ మొహం పెట్టుకొని జగన్ తిరుమలకు వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తిరుమల పర్యటనను అడ్డుకుంటామని స్వాములు స్పష్టం చేశారు. తమపైన ఆయన వాహనాలు ఎక్కించుకొని తిరుమలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. జగన్ పర్యటన సమయంలో లా అండ్ ఆర్డర్ సమస్య ఉత్పన్నమైతే జగనే బాధ్యత వహించాల్సి వస్తుందని స్వాములు హెచ్చరించారు.

**జగన్ ట్వీట్..** మరోవైపు తిరుమలకు జగన్ వచ్చే రోజే అంటే ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాల్లో పూజల్లో పాల్గొనాలని వైసీపీ నేతలు, కార్యకర్తలకు జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. "తిరుమల పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను, వేంకటేశ్వరస్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, స్వామివారి ప్రసాదమైన లడ్డూ పవిత్రతను,రాజకీయ దుర్బుద్ధితో, కావాలని అబద్ధాలాడి, జంతువుల కొవ్వుతో కల్తీ జరగనిది జరిగినట్టుగా, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్టుగా సీఎం చంద్రబాబు అసత్య ప్రచారం చేశారు. తిరుమలను, తిరుమల లడ్డూను, వేంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేశారు. చంద్రబాబు చేసిన ఈ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో సెప్టెంబరు 28న పూజల్లో పాల్గొనాలని వైయస్సార్‌సీపీ పిలుపునిస్తోంది" అని జగన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అలాగే మాజీ సీఎం వైఎస్ జగన్ ఈనెల 28న తిరుపతికి వచ్చి అలిపిరి నడక దారిలో తిరుమల చేరుకుని 29న శ్రీవారిని దర్శించుకుంటారని సమాచారం.

**డిక్లరేషన్‌పై ఉత్కంఠ...** అయితే అన్యమతస్తులు శ్రీవారి దర్శనానికి వస్తే డిక్లరేషన్ ఫామ్ ఇవ్వాల్సి ఉంటుంది. గత ఐదేళ్లలో సీఎం హోదాలో జగన్మోహన్ రెడ్డి అనేకసార్లు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రభుత్వంలో ఉండటంతో అధికారులు ఎవరూ జగన్‌ను డిక్లరేషన్ గురించి ఒత్తిడి చేయలేదు. దీంతో సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వకుండానే తిరుమల దర్శనానికి వెళ్లారు. అయితే తిరుమలకు వచ్చే భక్తులు కచ్చితంగా రూల్స్ పాటించాల్సి ఉంటుంది. అన్యమతస్తులు తిరుమల దర్శనానికి వస్తే స్వామి వారిపై తమకు విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జగన్ కచ్చితంగా డిక్లరేషన్ ఫామ్ ఇవ్వాల్సిందే అని కూటమి పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. మరి ఈ నెల 28న తిరుమలకు వస్తున్న జగన్ డిక్లరేషన్ ఇస్తారా.. లేదా అనే ఉత్కంఠ సర్వాత్రా నెలకొంది.

## ప్రాయశ్చిత్తం కోసమే తిరుమలకు జగన్: ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



జగ్గంపేట: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ప్రశాంతంగా ఉందని, జగన్ తిరుమల వెళ్లడం విద్వేషాలు రెచ్చగొట్టే కార్యక్రమమేనని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సంప్రదాయాలు పాటించలేదని విమర్శించారు.

ప్రాయశ్చిత్తం కోసమే ఆయన తిరుమలకు వెళ్తున్నారని వ్యాఖ్యానించారు. రెచ్చగొట్టేలా వైకాపా ఎమ్మెల్యేల తిరుపతి యాత్ర ఉందని మండిపడ్డారు. మత సామరస్యం దెబ్బతీసేందుకు ప్రణాళిక ప్రకారం కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నియమాలు, నిబంధనలు పాటించి జగన్ తిరుమలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

## వంగవీటి రాధాకు అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు

విజయవాడ: తెదేపా నేత వంగవీటి రాధా అస్వస్థతకు గురయ్యారు. ఛాతిలో నొప్పిగా ఉండటంతో ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.


## పర్యటక రంగాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది: మంత్రి దుర్గేశ్



నెల్లూరు: పర్యటక రంగాన్ని వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి దుర్గేశ్ విమర్శించారు. ఈ రంగానికి రెండేళ్లలో పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. 27న ప్రపంచ పర్యటక దినోత్సవం సందర్భంగా విజయవాడలో సమావేశం ఏర్పాటుచేశామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. 38 విభాగాల్లో అవార్డులు కూడా ఇవ్వబోతున్నామన్నారు. పర్యటక రంగం అభివృద్ధికి ప్రణాళికను తయారుచేసినట్లు పేర్కొన్నారు. బీచ్ రిసార్ట్స్, ఫెస్టివల్ రిసార్ట్స్, నగరవనాలు అభివృద్ధి చేస్తామని చెప్పారు.

**కాకుటూరు నగరవనాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెడతాం: సోమిరెడ్డి...** మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇంటికి మంత్రి కందుల దుర్గేశ్ వెళ్లారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. సర్వేపల్లి కోడూరులోని బీచ్‌ను అభివృద్ధి చేయాలని మంత్రి దుర్గేశ్‌ను కోరామన్నారు. గత ఐదేళ్లుగా పర్యటక ప్రాంతాలను ప్రైవేటు వ్యక్తులు సర్వనాశనం చేశారని విమర్శించారు. జిల్లాకు మంజూరైన 6 నగర వనాల అభివృద్ధి కోసం మంత్రికి ప్రతిపాదించినట్లు చెప్పారు. కాకుటూరు నగరవనాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టే బాధ్యత తనదేనని తెలిపారు.

## శ్రీవారి భక్తులకు ముఖ్య గమనిక.. బ్రహ్మోత్సవాల షెడ్యూల్ విడుదల



తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు కొలువైన నేల తిరుమలలో బ్రహ్మోత్సవాల షెడ్యూల్ విడుదల అయింది. టీటీడీ గురువారం ఈ షెడ్యూల్‌ను రిలీజ్ చేసింది. అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి టీటీడీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తుంది. అక్టోబర్ 4న ధ్వజారోహణం, అక్టోబర్ 8న గరుడసేవ, అక్టోబర్ 9న స్వర్ణరథం, 11న రథోత్సవం, అక్టోబర్ 12న చక్రస్నానం నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు ప్రారంభమవుతాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**రాకపోకలపై నిషేధం..** బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కొండపైకి వచ్చే వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. అక్టోబర్ 7 రాత్రి 11 గంటల నుంచి అక్టోబర్ 8 అర్ధరాత్రి వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలపై నిషేధం విధిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ.. ప్రత్యేక దర్శనాలు, వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయనుంది.

## కుళ్లు రాజకీయాలు చేస్తే.. ప్రజలు కుళ్లబొడిచేస్తారు జాగ్రత్త: మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి: కుళ్లు రాజకీయాలు చేస్తే.. ప్రజలు కుళ్లబొడిచేస్తారు జాగ్రత్త అని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. కలుగుల్లోంచి బయటకొచ్చిన వైకాపా నేతలు పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. పేర్ని నాని, కొడాలి నాని నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ చేసినోళ్లను వదిలిపెట్టబోమని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా మొత్తం నీట మునిగితే వైకాపా నేతలంతా ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. జిల్లా ప్రజల బాగోగుల కోసం తాపత్రయ పడిన చంద్రబాబుపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. పిచ్చివాగుడు కట్టిపెట్టి ప్రజా సమస్యలపై చర్చకు రావాలని కొల్లు రవీంద్ర సవాల్ విసిరారు.



## ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘానికి ప్రభుత్వం నోటీసులు

అమరావతి: ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘానికి(అప్సా) రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సాధారణ పరిపాలన శాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఏపీ సచివాలయ సంఘం గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలని అందులో పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంపై వివరణ కోరింది. సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అందుబాటులో లేకపోవడంతో అప్సా తరఫున కార్యదర్శి కృష్ణ, ఇతర ఆఫీసు బేరర్లు సమాధానమిచ్చారు. వ్యక్తిగత హోదాలోనే వెంకట్రామిరెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ప్రభుత్వానికి వారు వివరణ ఇచ్చారు. సచివాలయానికి వెలుపల కార్యకలాపాలపై ఎప్పుడూ సంప్రదించలేదని సాధారణ పరిపాలన శాఖకు తెలిపారు. ఎన్నికల్ కోడ్ ఉల్లంఘించి ఉంటే ఆయనపైనే చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. ఒక వ్యక్తి గురించి సంస్థ గుర్తింపు రద్దు చేసే నిర్ణయం తీసుకోవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం నుంచి తప్పుకుంటున్నట్లు కార్యదర్శి కృష్ణ ప్రకటించారు.

## పొట్టి వైట్ సూట్ లో రష్మిక స్టన్నింగ్!

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న.. ప్రస్తుతం నార్త్ టు సౌత్ చేతి నిండా సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. నాన్ స్టాప్ గా షూటింగ్స్ లో పాల్గొంటోంది. తక్కువ టైమ్ లోనే ఫుల్ పాపులారిటీ సంపాదించుకుంది. స్టార్ స్టేటస్ ను కూడా దక్కించుకుంది. స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు అందుకుంది. బ్లాక్ బస్టర్ హిట్స్ సాధించింది. హైయెస్ట్ రెమ్యునరేషన్ తీసుకుంటున్న హీరోయిన్లలో ఒకరిగా నిలిచింది. నేషనల్ క్రష్ గా తన టాలెంట్ ఏంటో చూపిస్తుంది. కన్నడ కస్తూరి అయిన రష్మిక మందన్న సోషల్‌మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటోంది. తన సినిమాలకు సంబంధించిన వివరాలతో పాటు వ్యక్తిగత విషయాలను కూడా ఎప్పటికప్పుడు అభిమానులతో షేర్ చేసుకుంటూ ఉంటోంది. రీసెంట్ గా ఒక మూడు వారాలపాటు నెట్టింట ఎక్కడా కనిపించని అమ్మడు.. ఆ తర్వాత తనకు చిన్న ప్రమాదం జరిగిందని తెలిపింది. డాక్టర్ల సలహా మేరకు ఫుల్ గా రెస్ట్ తీసుకున్నానని పేర్కొంది. ఆ తర్వాత మళ్లీ యాక్టివ్ గా మారింది రష్మిక మందన్న. రీసెంట్ గా జరిగిన మిలన్ ఫ్యాషన్ వీక్ షోలో అదరగొట్టేసింది రష్మిక. ఈవెంట్ గా స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. షో స్టాపర్ గా మెప్పించింది. తన గ్లామర్ షోతో ఫిదా చేసింది. బ్లాక్ కలర్ అండ్ వైట్ కలర్ ఔట్



ఫిట్స్ లో సందడి చేసింది. ఇప్పటికే బ్లాక్ కలర్ డ్రెస్ లో దిగిన పిక్స్ ను నెట్టింట షేర్ చేసిన బ్యూటీ.. ఇప్పుడు వైట్ కలర్ సూట్ లో తీసుకున్న ఫోటోలు పోస్ట్ చేసింది. ఇటాలియన్ ఫ్యాషన్ డిజైనర్ డోనాటెల్లో వార్సెస్ డిజైన్ చేసిన ఆ ఔట్ ఫిట్ లో రష్మిక వేరే లెవల్ లో ఉంది. పొట్టి సూట్ వేసుకున్న రష్మిక.. తన అందాలతో మైమరిపించింది. తన థైస్ షోతో మైండ్ బ్లాక్ చేసింది. బ్లాక్ కలర్ హ్యాండ్ బ్యాగ్ పట్టుకుని సింపుల్ గా పోజులిచ్చింది. తన గ్లోయింగ్ ఫేస్ తో అందరినీ క్లీన్ బౌల్డ్ చేసింది. నేషనల్ క్రష్ అని మరోసారి ప్రూవ్ చేసుకుంది. ప్రస్తుతం అమ్మడి పిక్స్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారాయి. ఓ రేంజ్ లో చక్కర్లు కొడుతున్నాయి. అమ్మడు సూపర్ గా ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఒక్కో ఫోటో.. వేరే లెవల్ లో ఉందని కొనియాడుతున్నారు. ఇక రష్మిక సినిమాల విషయానికొస్తే.. బాలీవుడ్ లో విక్కీ కౌశల్ కు జోడీగా ఛావాలో యాక్ట్ చేస్తోంది. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న కుబేరలో నటిస్తోంది. గర్ల్ ఫ్రెండ్ మూవీలో దీక్షిత్ శెట్టితో స్క్రీన్ షేర్ చేసుకుంటోంది. త్వరలోనే బ్లాక్ బస్టర్ హిట్ పుష్ప సీక్వెల్ తో సందడి చేయనుంది. ఫస్ట్ పార్ట్ లో శ్రీవల్లిగా అందరి మనసులను దోచుకున్న రష్మిక.. ఇప్పుడు శ్రీవల్లి 2.0గా అలరించనుంది. మరి తన అప్ కమింగ్ మూవీస్ తో ఎలాంటి హిట్స్ అందుకుంటుందో వేచి చూడాలి.

## విజయ్, షారుఖ్ వారసుల దారిలో రవితేజ వారసుడు!


సినిమా ఇండస్ట్రీలో వారసుల ఎంట్రీ అనేది ఇప్పుడు కొత్తగా వస్తున్నది కాదు. అన్ని భాషల సినిమా ఇండస్ట్రీల్లోనూ ప్రస్తుతం వారసులే ఎక్కువగా ఉన్నారు. స్టార్ హీరోల వారసులు ఎక్కువ శాతం ఇండస్ట్రీలోనే ఏదో ఒక రకంగా ఎంట్రీ ఇస్తున్న విషయం మనం చూస్తున్నాం. ముఖ్యంగా హీరోల వారసులు ఎక్కువగా హీరోలుగానే ఎంట్రీ ఇస్తున్నారు. కానీ ప్రస్తుత జనరేషన్ లో మాత్రం కాస్త మార్పు కనిపిస్తుంది. బాలీవుడ్ బాద్ షా షారుఖ్ తనయుడు దర్శకత్వం చేస్తున్నాడు, కోలీవుడ్ సూపర్ స్టార్ విజయ్ తనయుడు డైరెక్షన్ చేస్తున్నాడు. ఇప్పుడు రవితేజ తనయుడు సైతం దర్శకుడిగా వచ్చేందుకు సందీప్ వంగ వద్ద అసిస్టెంట్ గా చేస్తున్నాడు. టాలీవుడ్ తో పాటు అన్ని భాషల సినిమా ఇండస్ట్రీలోనూ వారసులు పెద్ద మొత్తంలో ఉన్నారు. ముందు ముందు చాలా మంది వారసులు రాబోతున్నారు.



సినిమా ఇండస్ట్రీలో వస్తున్న పారితోషికాలు, గుర్తింపు కారణంగా మరే చోట దక్కదు. అందుకే హీరోల వారసులు మాత్రమే కాకుండా దర్శక నిర్మాతల వారసులు సైతం సినిమా ఇండస్ట్రీలోనే ఎంట్రీ ఇస్తున్నారు. స్టార్స్ కిడ్స్ ఎక్కువ శాతం హీరోలుగా ఎంట్రీ ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ తనయుడు మహాధన్ మాత్రం దర్శకత్వం పై ఆసక్తి చూపిస్తున్నారు. ఆ మధ్య ఒక సినిమాలోనూ నటించిన ఇతగాడు త్వరలోనే హీరోగా ఎంట్రీ ఇస్తాడని అంతా అనుకుంటున్నారు. హీరోగా ఎంట్రీ ఇస్తాడని భావిస్తున్న తరుణ్ లో మహాధన్ దర్శకత్వం పై ఆసక్తిని కనబర్చుతున్నట్లుగా తెలుస్తోంది. తనకు ఎంతో ఇష్టమైన దర్శకుడు సందీప్ వంగ వద్ద ప్రస్తుతం అసిస్టెంట్ గా మహాధన్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం అతడి వయసు తక్కువే. కనుక మరో రెండు మూడు సంవత్సరాల తర్వాత దర్శకుడిగా ఎంట్రీ ఇస్తాడేమో చూడాలి. దర్శకులుగా చేసిన వారు హీరోలుగా చేశారు. రవితేజ అసిస్టెంట్ డైరెక్టర్ గా ఇండస్ట్రీలో అడుగు పెట్టినా హీరోగా మారిన విషయం తెల్సిందే. మహాధన్ సైతం మొదట దర్శకుడిగా చేసి ఆ తర్వాత హీరోగా ఎంట్రీ ఇస్తాడేమో చూడాలి. దర్శకుడిగా మెళకువలు నేర్చుకుంటే హీరోగా మంచి సినిమాలు ఎంపిక చేసుకునే అవకాశాలు ఉంటాయనే ఉద్దేశ్యంతో మహాధన్ ప్రస్తుతం సందీప్ వంగ వద్ద అసిస్టెంట్ గా చేస్తున్నాడా అనేది తెలియాల్సి ఉంది. మొత్తానికి మహాధన్ అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేస్తున్నాడు. ఈ విషయం రవితేజ ఫ్యాన్స్ కి ఒకింత నిరుత్సాహం కలిగించేదే. కానీ ముందు ముందు కచ్చితంగా వారు కోరుకున్న విధంగా సినిమా ఇండస్ట్రీలో మహాధన్ హీరోగా సినిమాలు చేస్తాడేమో చూడాలి. విజయ్ తనయుడు, షారుఖ్ ఖాన్ తనయుడు సైతం హీరోలుగా ఎంట్రీ ఇస్తారని ఫ్యాన్స్ ఆశిస్తే డైరెక్షన్ వైపు అడుగులు వేస్తున్నారు. వారు సైతం భవిష్యత్తులో హీరోలుగా ఎంట్రీ ఇస్తారేమో చూడాలి.




## కిరణ్ అబ్బవరం 'క'.. పెద్ద టాస్క్ కంప్లీట్




యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం.. ఈ టాలీవుడ్ యంగ్ హీరోకి ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. తనకంటూ స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. రాజావారు రాణిగారు మూవీతో తెలుగు ఇండస్ట్రీకి హీరోగా పరిచయమైన ఆయన.. ఎస్ ఆర్ కళ్యాణమండపం, సమ్మతమే వంటి పలు సినిమాలతో మెప్పించారు. గత ఏడాది రెండు సినిమాల్లో నటించగా.. అనుకున్న స్థాయిలో మెప్పించలేకపోయారు. ఇప్పుడు పాన్ ఇండియా రేంజ్ లో 'క'చిత్రంతో సందడి చేయనున్నారు కిరణ్ అబ్బవరం. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో కూడా 'క' మూవీ రిలీజ్ కాబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. అయితే 1970స్ బ్యాక్ డ్రాప్, ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణగిరి గ్రామం నేపథ్యంతో సాగే పీరియాడిక్ థ్రిల్లర్ గా ప్రేక్షకుల ముందుకు రానున్న మూవీకి సుజీత్, సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాతో టాలీవుడ్ లోకి డైరెక్టర్లుగా ఎంట్రీ ఇస్తున్నారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి.. భారీ బడ్జెట్ తో రూపొందిస్తున్నారు. తాజాగా 'క' మూవీ మేకర్స్ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. షూటింగ్ కంప్లీట్ అయినట్లు వెల్లడించారు. అనేక సుందరమైన ప్రదేశాలు.. ప్రారంభం నుంచి ముగింపు వరకు ఒక గొప్ప ప్రయాణం అని ట్వీట్ చేశారు. షూటింగ్ సెట్స్ లో కంప్లీట్ టీమ్ దిగిన పిక్స్ ను షేర్ చేశారు. బ్యాక్ గ్రౌండ్ లో పర్ఫెక్ట్ విలేజ్ సెటప్ కనిపిస్తుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మేకర్స్ వెల్లడించారు. మరిన్ని అప్డేట్స్ త్వరలో రానున్నాయని ప్రకటించారు. దీంతో మూవీ కోసం వెయిటింగ్ అని సినీ ప్రియులు చెబుతున్నారు. అయితే ఇప్పటికే 'క' సినిమా నుంచి మేకర్స్ విడుదల చేసిన పోస్టర్స్, టీజర్ మంచి రెస్పాన్స్ దక్కించుకున్నాయి. మూవీపై పాజిటివ్ బజ్ కూడా క్రియేట్ చేశాయి. అదే జోష్ తో మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ సింగిల్ వరల్డ్ ఆఫ్ వాసుదేవ్ ప్రోమో ఆక ట్టు కుంది. మూవీ టీజర్ లో పోస్ట్ మ్యాన్ గా కనిపించారు కిరణ్ అబ్బవరం. ఆయన లుక్ కొత్తగా అనిపించింది. సినిమాలో కిరణ్ అబ్బవరం పాజిటివ్ క్యారెక్టర్ లో కనిపించనున్నారా లేదా నెగెటివ్ షేడ్స్ క్యారెక్టర్ చేస్తున్నారా అనేది టీజర్ ద్వారా మేకర్స్ సస్పెన్స్ క్రియేట్ చేశారు. ఇక సినిమా విషయానికి వస్తే.. సామ్ సీఎస్ అదిరి పోయే మ్యూజిక్ అందిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ కాన్సెప్ట్ తో రానున్న 'క' మూవీ.. అక్టోబర్ లో రిలీజ్ అయ్యే అవకాశం ఉన్న ట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. దీపావళి స్పెషల్ గా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు సమాచారం. తెలుగులో నిర్మాత నంది పాటి వంశీ విడుదల చేయనుండగా.. మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ రిలీజ్ చేస్తున్నారు. మరి 'క' మూవీతో కిరణ్ అబ్బవరం పాన్ ఇండియా లెవెల్ లో ఎలాంటి విజయాన్ని అందుకుంటారో వేచి చూడాలి.

## బన్ని - చరణ్ : డిసెంబర్ పుంజులు సై




సంక్రాంతి 2025 కి అగ్ర హీరోల మధ్య నువ్వా నేనా? అంటూ రఫ్ పోటీ ఉండనుంది. అయితే అంతకుముందే, ఈసారి తెలుగు ప్రేక్షకులకు డిసెంబర్ లో స్పెషల్ ట్రీట్ ఖరారైంది. సంవత్సరం ముగింపు నెలలో రెండు భారీ చిత్రాలు థియేటర్లలోకి వస్తాయనే దానిపై ఇప్పుడు చాలావరకూ స్పష్టత వచ్చింది. ఇప్పటివరకూ పుష్ప 2 మాత్రమే డిసెంబర్ రేసులో ఉంది అనుకున్న వారికి గేమ్ ఛేంజర్ రాక ఫుల్ క్లారిటీ ఇచ్చింది. రెండు పెద్ద సినిమాలు డిసెంబర్‌లో భారీ స్థాయిలో విడుదల కానున్నాయనేది తాజా అప్ డేట్. రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ విడుదల తేదీపై దర్శకనిర్మాతలు ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా కానీ, ఇది క్రిస్మస్ 2024 సీజన్‌లో 20 డిసెంబర్ 2024న థియేటర్లలోకి రానుంది. మేకర్స్ ఈ నెలాఖరులో పాటలు, టీజర్లు ఇతర ప్రచార సామగ్రిని విడుదల చేస్తారని సమాచారం. ఈ వారాంతంలో ప్రచార కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. శంకర్ దర్శకత్వంలో గేమ్ ఛేంజర్ చిత్రాన్ని దిల్ రాజు నిర్మించారు. ఇందులో రామ్ చరణ్ ఐఏఎస్ అధికారిగా నటిస్తున్నారు. కియరా అద్వానీ కథానాయిక. మరోవైపు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీ పుష్ప 2ని 6 డిసెంబర్ 2024న విడుదల చేస్తున్నారు. ఇరు సినిమాలకు కేవలం వారాల గ్యాప్ ఉంటుంది. అయితే ఒకే సీజన్ లో రెండు పెద్ద సినిమాల విడుదల సరి కాదు అన్న నియమం గురించి ప్రస్థావిస్తే.. సినిమాలో కంటెంట్ ఉంటే రెండు సినిమాలు హిట్ అవుతాయని రామ్ చరణ్ అన్నారట. అలాగే గేమ్ ఛేంజర్ రిలీజ్ తేదీ విషయంలో చరణ్ చాలా కఠినంగా ఉన్నారని కూడా గుసగుస వినపిస్తుంది. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2లో రష్మిక మందన్న కథానాయిక. సుకుమార్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. మెగాభిమానులకు డిసెంబర్ లో ధమాకా ట్రీట్ రెడీ గా ఉందన్నమాట.

## ఘాటైన లుక్కులో షాలిని పాండే.. మైండ్ బ్లాక్!

శాలిని పాండే.. ఈ పేరు వినగానే తెలుగు ప్రేక్షకులకు వెంటనే గుర్తుకు వచ్చే చిత్రం అర్జున్ రెడ్డి. ఈ సినిమాలో తన నేచురల్ పెర్ఫార్మెన్స్ తోనే కాకుండా తన గ్లామర్ తో కూడా ప్రేక్షకులను కట్టిపడేసింది. మొదటి సినిమాతోనే భారీ క్రేజ్ సంపాదించుకున్న ఈ క్యూట్ హీరోయిన్, అప్పటి నుంచి ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయితే అర్జున్ రెడ్డి తర్వాత అదే స్థాయిలో సక్సెస్ పొందలేకపోయింది. ఇప్పటివరకు పదిహేనుకు పైగా సినిమాలు చేసినప్పటికీ, శాలిని పాండేకు స్టార్ హీరోయిన్ స్థాయికి చేరే అవకాశాలు మాత్రం ఇంకా రావడం లేదు. అయినప్పటికీ, సోషల్ మీడియాలో తన గ్లామర్ ఫోటోషూట్లతో నిత్యం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో పెరుగుతున్న ఫాలోవర్స్ తో పాటు, తన గ్లామర్ డోస్ ని కూడా పెంచుకుంటూ, ఫ్యాన్స్ లో మరింత క్రేజ్ పొందుతోంది. తాజాగా



ఆమె షేర్ చేసిన ఫోటో ఒకటి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ ఫోటోలో ఆమె బ్లాక్ కలర్ డ్రెస్ లో స్టైల్ గా ఉన్నప్పటికీ, ఆమె గ్లామర్ మాత్రం మరింతగా హైలైట్ అయ్యింది. తలవంచి అలా ఇచ్చిన ఈ స్టిల్ అభిమానులను మరింత ఆకట్టుకుంది. ఫోటోలో ఆమె ముఖం మీద హ్యాపీ ఎక్స్‌ప్రెషన్ కనిపించడం, మెడ దగ్గర అందాలు ఘాటుగా ప్రెజెంట్ కావడం మరింతగా ఆకర్షణగా నిలిచాయి. ఇక సోషల్ మీడియాలో ఈ ఫోటోపై పాజిటివ్ కామెంట్స్ వెల్లువెత్తుతున్నాయి. "షాలిని మరోసారి తన గ్లామర్ తో స్టన్ అయ్యేలా చేసింది" అంటూ ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. గతంలో కూడా శాలిని పాండే ఈ తరహాలో బోల్డ్ ఫోటోలు షేర్ చేసినప్పటికీ, తాజా ఫోటో మాత్రం అభిమానులను కొత్తగా అనిపించింది. ఇక ప్రస్తుతం అమ్మడు తమిళంలోనే కాకుండా బాలీవుడ్ లో కూడా చిన్న చిన్న సినిమాలతో బిజీగా కనిపిస్తోంది.

## చీరలో ఉప్పెన పాప.. హై గ్లామర్ ట్రీట్

గ్లామరస్ బ్యూటీ కృతి శెట్టి తన మొదటి సినిమాతోనే టాలీవుడ్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఉప్పెన సినిమా ద్వారా యూత్‌లో ఫేవరెట్ హీరోయిన్‌గా మారిన కృతి, ఆ తర్వాత వరుసగా మంచి అవకాశాలు అందుకుంది. కానీ, ఆ సినిమాల ఫలితాలు అనుకున్నంత స్థాయిలో లేకపోవడంతో కెరీర్‌లో కొంత తగ్గుదల కనిపించింది. ఉప్పెన తర్వాత నాని తో చేసిన శ్యామ్ సింగరాయ్, నాగ చైతన్య తో చేసిన బంగార్రాజు సినిమాలు సక్సెస్ సాధించినా, ఆ తర్వాత వచ్చిన మాచర్ల నియోజకవర్గం, వారియర్, కస్టడీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. అయితే, సినిమాల పరంగా వచ్చిన



ఈ కష్టాలను పక్కన పెడితే, కృతి శెట్టి సోషల్ మీడియాలో మాత్రం పూర్తిగా తన క్రేజ్‌ను నిలబెట్టుకుంది. ఇటీవల తన గ్లామర్ ఫోటోషూట్స్‌తో ప్రేక్షకులను, అభిమానులను ఆకట్టుకుంటూ వస్తోంది. పలు స్టైలిష్ ఔట్‌ఫిట్స్‌లో కృతి తన గ్లామర్‌ను నూతన పంథాలో చూపిస్తూ ఫ్యాషన్ లవర్స్‌ని, యూత్‌ని ఎంతగానో ఆకర్షిస్తోంది. తాజాగా కృతి, పింక్ కలర్ చీరలో కనువిందు చేస్తూ, ఫ్యాన్స్ హృదయాలను దోచుకుంటోంది. ఆమె బాడీ లాంగ్వేజ్, సున్నితమైన నడుము, చిరునవ్వుతో ఫోటోలో మరింత గ్లామర్‌ను మెరిసేలా చేస్తోంది. సోషల్ మీడియాలో ఆమె షేర్ చేస్తున్న ప్రతి ఫోటో వైరల్ అవుతూ, అభిమానుల నుంచి మంచి స్పందనను రాబడుతోంది. కృతి పిక్స్‌కు నెటిజన్లు "బేబమ్మ అదుర్స్", "సూపర్ గ్లామర్" అంటూ కామెంట్లతో ప్రేమను చాటుతున్నారు. ఇప్పటికే తమిళ, మలయాళ చిత్రాల్లో పలు ప్రాజెక్ట్స్‌లో బిజీగా ఉన్న కృతి, తెలుగు సినిమాల్లో తిరిగి అవకాశాలను అందుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. మరి రాబోయే రోజుల్లో అమ్మడికి ఎలాంటి అవకాశాలు అందుతాయో చూడాలి.




కొండాపూర్: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మధిర గ్రామం కుతుబ్‌శాయి పేట్ గ్రామంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు అక్రమ నిర్మాణాన్ని గుర్తించారు. కొందరు వ్యక్తులు చెరువులోనే బహుళ అంతస్తుల భవనం కట్టడంతో చర్యలు తీసుకున్నారు. బాంబుల ద్వారా అక్రమ కట్టడాన్ని నేలమట్టం చేశారు. ఈక్రమంలో బాంబులు పేలి శిథిలాలు ఎగిరిపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి 12 సంవత్సరాల క్రితం మల్కాపురం పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ భవనాన్ని నిర్మించారు. నీళ్లలో అడుగుపెట్టకుండా లోనికి వెళ్లడానికి కొంత దూరం నుంచే మెట్లు కట్టారు. యజమాని కుటుంబ సభ్యులు వారాంతాల్లో వచ్చి ఇక్కడ సేదతీరుతూ ఉండేవారు.




దిల్లీ: దేశీయంగా పసిడి ధర మళ్లీ పెరిగింది. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి (24 క్యారెట్లు) ధర గురువారం మరో రూ.400 పెరిగి రూ.78 వేల మార్కును చేరుకుంది. అంతర్జాతీయంగా పసిడికి డిమాండ్ నెలకొనడం, దేశీయంగానూ వర్తకుల నుంచి కొనుగోళ్లు కొనసాగుతుండడం పసిడి ధరలకు రెక్కలు రావడానికి కారణాలుగా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. బుధవారం రూ.77,850 వద్ద ముగిసిన బంగారం ఇవాళ మరో రూ.400 పెరిగి తాజా గరిష్ఠమైన రూ.78,250 మార్కును దాటినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. మరోవైపు వెండికీ పసిడితో సమానంగా డిమాండ్ కొనసాగుతోంది. కిలో వెండి తాజాగా మరో వెయ్యి రూపాయలు పెరిగి రూ.94వేల మార్కు చేరుకోవడం గమనార్హం. అంతర్జాతీయ కమొడిటీ ఎక్స్ఛేంజీలో బంగారం ఔన్సు 2701 డాలర్లు పలుకుతోంది.

ద్రవ్యోల్బణం కట్టడికి ఇన్నాళ్లూ వడ్డీ రేట్లు పెంచుకుంటూ వచ్చిన కేంద్ర బ్యాంకులు... ఇప్పుడు వృద్ధికి ఊతం ఇచ్చేందుకు వడ్డీ రేట్లను తగ్గించేందుకు ముందుకొస్తున్నాయి.

దీనికి తోడు పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం కూడా పసిడికి డిమాండ్ ఏర్పడిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. డాలరు ధర క్షీణించడం కూడా మరో కారణమని తెలిపారు.

## అధికారులు ఎలాంటి తప్పు చేయకూడదో ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: అధికారులు జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదో దానికి ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సీఎం చేతుల మీదగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న జలసౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. "పైఅధికారులు చెప్పారని నాణ్యత, నిబద్ధత విషయంలో ఎప్పుడూ రాజీపడొద్దు. నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవు. నాణ్యతగా లేకుంటే.. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇన్నేళ్లు ఉండేవి కావు.

దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు లక్షల ఎకరాలకు నీళ్లు, విద్యుత్ ఇస్తున్నాయి. కానీ, ఐదేళ్ల క్రితం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే కూలిపోయింది. నిర్మాణం పూర్తి కాకముందే కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును ఎలా అధ్యయనం చేయాలి. ఈ ప్రాజెక్టును గత పాలకులు ప్రపంచ అద్భుతంగా వర్ణించారు. కాళేశ్వరం విషయంలో ఎవరిని బాధ్యులుగా చేయాలి? క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు సమర్థంగా పనిచేసి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదు. నిర్మాణ సామగ్రి నాణ్యతగా లేదని ఇంజినీర్లు వెనక్కి పంపి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. ఒక దేశం గొప్పతనాన్ని చెప్పేది ఆ దేశంలోని నిర్మాణాలు, కట్టడాలే" అని సీఎం అన్నారు.




హైదరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ ఘటనపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి స్పందించారు. ప్రసాదం అపవిత్రం కావడంపై హిందువులంతా బాధపడుతున్నారన్నారు. "తితిదే ఎంతో పవిత్రమైంది. నమ్మకం లేనపుడు హిందూ ఆలయాలకు ఎందుకు వెళ్తున్నారు. ప్రసాదం అపవిత్రం చేసినవాళ్లు తిరుమలకు ఎందుకు వెళ్తానంటున్నారు.. ఇది సరైందేనా?"అని పరోక్షంగా వైకాపా అధ్యక్షుడు జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.




హైదరాబాద్: మరో 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్‌కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. "విద్య, ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సి ఉంది. ప్రతి ఒక్కరికీ విడివిడిగా హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలి. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజల హెల్త్ ప్రొఫైల్స్‌ను డిజిటలైజ్ చేయాల్సి ఉంది. ఈ హెల్త్‌కార్డుల్లో గత చికిత్స వివరాలు పొందుపరుస్తారు"అని తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ సంఘం ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగం కావాలని కోరారు.

## తిరుపతి లడ్డూ వివాదం.. యూపీ ఆలయాల్లో కీలక మార్పులు..




తిరుమల లడ్డూ వివాదం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యిలో జంతు వ్యర్థాలు, కొవ్వు పదార్థాలు కలిశాయని ఎన్‌డీబీబీ నివేదిక స్పష్టం చేయడంతో దేశంలోని వివిధ ఆలయాలు అప్రమత్తం అయ్యాయి. ప్రసాదం కోసం భక్తులు బయట నుంచి స్వీట్లు, ఇతర వండిన పదార్థాలను తీసుకురావొద్దని ప్రయాగ్‌రాజ్‌లోని కొన్ని ఆలయాలు ఆంక్షలు విధించాయి. కొబ్బరి కాయలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్ మాత్రమే ప్రసాదంగా తీసుకురావాలని ఆలయ ప్రతినిధులు కోరారు. ప్రయాగ్‌రాజ్‌లోని ఆలోప్ శంకరీ దేవి, బడే హనుమాన్, మంకమేశ్వర్‌తో సహా సంగమ్ నగరంలోని పలు ప్రముఖ దేవాలయాలు ప్రసాదాల విషయంలో పలు ఆంక్షలను ప్రకటించాయి. ప్రయాగ్‌రాజ్‌లోని ప్రముఖ లలితా దేవి ఆలయంలో ఓ సమావేశం ఏర్పాటుచేసి అమ్మవారికి స్వీట్లను ప్రసాదం ఇవ్వకూడదని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. స్వీట్లకు బదులు కొబ్బరి, పండ్లు, డ్రై ఫ్రూట్స్ వంటివి అమ్మవారికి సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని ఆలయ పూజారులు అధికారికంగా తెలియజేశారు. కల్తీ పదార్థాలతో తయారైన స్వీట్లను అమ్మవారికి సమర్పించకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే త్వరలో ఆలయ ప్రాంగణంలో భక్తులకు స్వచ్ఛమైన స్వీట్లు అందుబాటులో ఉండేలా దుకాణాలు తెరిచే ఆలోచనలో ఉన్నట్లు ఆలయ ప్రతినిధులు వెల్లడించారు.

**మరికొన్ని ఆలయాల్లో..** భక్తులు బయటి నుంచి స్వీట్లు, ప్రసాదాలు తీసుకురాకుండా నిషేధం విధించినట్లు ఆలోప్ శాంకరీ దేవి ఆలయ పూజారులు ప్రకటించారు. యమునా నది ఒడ్డున ఉన్న మంకమేశ్వర్ ఆలయానికి బయటి నుండి ప్రసాదం తీసుకురావడాన్ని నిషేధించారు. ఆలయం వెలుపల దుకాణాల్లో లభించే ప్రసాదం నాణ్యతను పరీక్షించాలని జిల్లా కలెక్టర్‌కు ఆలయ ప్రతినిధులు లేఖలు రాశారు. నాణ్యత పరీక్షలు పూర్తయ్యేవరకు దుకాణాల్లో లభించే స్వీట్లను ఆలయంలో ప్రసాదం సమర్పించడానికి అనుమతించబోమని, స్వీట్ల స్థానంలో పండ్లను సమర్పించాలని భక్తులను కోరుతున్నట్లు తెలిపారు.

**తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో..** తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ప్రసాదాల విషయంలో భక్తుల్లో ఆందోళన నెలకొంది. స్వీట్లను ప్రసాదంగా ఉపయోగిస్తున్న ఆలయాల్లో వాటికి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారు. లడ్డూ ప్రసాదం కోసం ఉపయోగించే వస్తువుల స్వచ్ఛతను పరీక్షిస్తున్నారు. ప్రసాదాల తయారీ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. తిరుమల లడ్డూ వివాదం తరువాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశంలోని అన్ని ఆలయాల్లో ప్రసాదాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపిస్తున్నారు. మరోవైపు తిరుమల లడ్డూ వివాదంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే.



## జర్నలిస్ట్ మృతిపై తెలుగు రాష్ట్రాల సీఎంల సంతాపం

హైదరాబాద్: సీనియర్ జర్నలిస్ట్ టి ఆదినారాయణ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందారు. గురువారం ఉదయం అపార్ట్‌మెంట్‌పై వాకింగ్ చేస్తుండగా జారిపడ్డారు. వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోకి తీసుకెళ్లేలోపు చనిపోయారు. గత 25 ఏళ్ల నుంచి నారాయణ ఈటీవీలో పనిచేస్తున్నారు. నారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**సీఎం రేవంత్ సంతాపం :** నారాయణ మృతిపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. నారాయణ అకాల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదినారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

నారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

## సిరిసిల్ల నేతలన్న తరఫున పోరాటానికి సిద్ధం: కేటీఆర్



సిరిసిల్ల: భారాస హయాంలో నేతలన్నను కాపాడుకున్నామని, ఇప్పుడు మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో ఆయన మీడియాతో మాట్లాడారు. సిరిసిల్ల నేతలన్నకు రూ.3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చామని, ఉపాధి కల్పనతో నేతన్నల ఆత్మహత్యలు తగ్గాయన్నారు. "ప్రజలకు కేసీఆర్ కిట్లు, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక అందజేశాం. నేతన్నలతో చీరలు నేయించి పంపిణీ చేశాం. సిరిసిల్లను మరో తిరుప్పూరు చేయడానికి కృషి చేశాం. కాంగ్రెస్ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిపివేశారు. బతుకమ్మ చీరల్లో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. దానిపై విచారణ చేయాలని అసెంబ్లీ సాక్షిగా చెప్పాం. సిరిసిల్ల నేతన్నల తరఫున పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. మా పోరాటానికి నేతన్నలు కూడా సహకరించాలి"అని కోరారు.

## శ్రీవారికి జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా మాధవీలత ఏం చేశారంటే..

హైదరాబాద్, సెప్టెంబర్ 26: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వాడకంపై తెలంగాణ బీజేపీ మహిళా నేత, ఫైర్ బ్రాండ్ మాధవీలత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. హిందువులు పవిత్రంగా స్వీకరించే శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వాడారంటే అది అత్యాచారం కిందకే వస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా వెంకటేశ్వరస్వామికి జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా తిరుమలకు వెళ్లాలని ఆమె నిర్ణయించారు. అందులో భాగంగానే సహచర భక్త బృందంతో కలిసి మాధవీలత తిరుమలకు బయలుదేరారు. వందేభారత్ రైలులో బీజేపీ మహిళా నేత హైదరాబాద్ నుంచి తిరుమలకు పయనమయ్యారు. వేంకటేశ్వరస్వామికి జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా నడక మార్గంలో తిరుమలకు చేరుకుని స్వామివారిని బీజేపీ నేత దర్శించుకోనున్నారు. సహచర భక్త బృందంతో కలిసి ఆ గోవిందుడి నామం జపిస్తూ.. శ్రీనివాసుడి పాటలు పాడుతూ భజన చేస్తూ వందేభారత్‌తో రైలులో మాధవీలత తిరుమలకు బయలుదేరారు. మరోవైపు.. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటనను ప్రతీఒక్కరూ వ్యతిరేకిస్తున్న పరిస్థితి. తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తీవ్ర ప్రకంపనలు రేపింది. ప్రతీ ఒక్క హిందువు, హిందూ సంఘాలు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి ప్రసాదాన్ని హిందువులు పరమ పవిత్రంగా భావిస్తారు. అటువంటి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిపారని నిర్ధారణ అవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు సంస్థను(సిట్) కూడా ఏర్పాటు చేసింది. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 11 రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టారు. అక్టోబర్ 1న పవన్ తిరుమలకు వెళ్లి దీక్షను విరమించనున్నారు. అలిపిరి మెట్ల మార్గన తిరుమలకు వెళ్లి.. స్వామి వారిని దర్శించుకుని దీక్షను విరమించనున్నారు డిప్యూటీ సీఎం.

## వరద నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలి.. - కమిషనర్ ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ: వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో వరద నిలువకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. అడిషనల్, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల హెచ్‌వోడీలతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాల సమయంలో నీరు నిలిచే చోట శాశ్వత పరిష్కారం చూపాలని, ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక అందజేయాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ కమర్షియల్‌గా ఉండి, రెసిడెన్షియల్ ట్యాక్స్ చెల్లిస్తున్న యజమానులకు నోటీసులు జారీచేసి ట్యాక్స్ రివిజన్ చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారికి పెద్ద మొత్తంలో జరిమానాలు విధించాలని ఆదేశించారు. మరో సమీక్షలో నగరంలో కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. వైద్యారోగ్యశాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని..యాంటీ లార్వల్, ఫాగింగ్ విస్తృతం చేయాలని పేర్కొన్నారు.

**ఎల్బీనగర్ జోన్‌లో కమిషనర్ ఆకస్మిక పర్యటన :** వర్షాల నేపథ్యంలో కమిషనర్ ఆమ్రపాలి ఎల్బీనగర్ జోన్‌లోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. శానిటేషన్ నిర్వహణ, రోడ్లపై పాట్‌హోల్స్ తదితర వాటిని పరిశీలించారు. సరూర్‌నగర్ నుంచి ఎల్బీనగర్, నాగోల్ రోడ్ మీదుగా ఉప్పల్ భగాయత్, ఉప్పల్ స్టేడియం రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్డు మరమ్మతులు, శానిటేషన్‌పై తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com